
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 05.02.2016, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 36 పేజీలు : 12, వెల : ₹ 5







# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com




- జగన్‌కు చెలగాటం... బాబుకు సంకటం
- ఓట్ల కోసం ఆడిన డ్రామా అడ్డం తిరిగింది
- రెచ్చగొట్టింది తెదేపా... చిచ్చుపెట్టింది వైకాపా

# కులం మంటల్లో 'దేశం'

ఉత్తరప్రదేశ్, బీహార్, కర్నాటక.... కులరాజకీయాలకు కేంద్రాలుగా నిలిచిన రాష్ట్రాలు. కులమే అక్కడ పార్టీలకు బలం. కులం పునాదుల పైనే పార్టీల నిర్మాణం జరుగుతుంది. అలాంటి రాష్ట్రాలను ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ దాటుతుందా? అభివృద్ధిలో అడుక్కిపోయి కుల కంపుతో అగ్రభాగాన నిలవబోతుందా? జరుగుతున్న పరిణామాలు, మారుతున్న పరిస్థితులు అవుననే అంటున్నాయి. తూర్పుగోదావరి జిల్లా తునిలో ఒక కులం పేరుతో జరిగిన విధ్వంసకాండ దీనికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.

(మిగతా 11వ పేజీలో)


VAMSIRAM BUILDERS Harsha Auto VPR

## నెల్లూరోళ్ళ సారథ్యంలో హైదరాబాద్‌లో

## శ్రీవారి వైభవోత్సవాలు

- ఫిబ్రవరి 6 నుండి 12 వరకు

(వివరాలు 12వ పేజీలో)






# పవర్ తగ్గిన స్టార్

- కమెడియన్‌ను తలపిస్తున్న హీరో

ప్రశ్నించడానికే రాజకీయాల్లోకి వచ్చానని చెప్పిన పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ రాజకీయాలలో తన ఉనికినే పెద్ద ప్రశ్నార్థకంగా చేసిపెట్టాడు. ఎందుకు రాజకీయాల్లోకి వచ్చావు? ఎందుకు పార్టీని పెట్టావు? ఎందుకు చంద్రబాబుకు మద్దతు తెలిపావు? ఎందుకు తెలుగుదేశం ప్రభుత్వ అక్రమాలను ప్రశ్నించలేకపోతున్నావు? వంటి ప్రజలు, అభిమానులు సంధిస్తున్న ప్రశ్నలకు జవాబులు చెప్పలేని స్థితిలో ఆయనున్నాడు.

చిరంజీవి రాజకీయపార్టీని పెట్టి రెండేళ్లన్నా నడిపాడు. ఆ తర్వాత కాంగ్రెస్‌పార్టీకి అమ్మేసుకుని కేంద్రమంత్రి పదవిని అనుభవించాడు. దీని తర్వాత చిరంజీవి ఇమేజ్ అమాంతం పడిపోయింది. పవన్ కల్యాణ్ ఇమేజ్ పడిపోవడానికి అంత టైం కూడా పట్టలేదు. 2014ఎన్నికల్లో తెలుగుదేశం అధికారంలోకి రావడానికి కారణాలలో పవన్ కల్యాణ్ ఒకడు. ప్రభుత్వం వల్ల ప్రజలకు నష్టం

(మిగతా 11వ పేజీలో)



# ఇవేం నోర్లు... ఇవేం మాటలు

## నువ్వు డాల్ డకార్ ... నువ్వు లత్కోర్...

మొన్నటి దాకా నెల్లూరు రాజకీయాలు బాగా చప్పగా వుండినాయి. నేతల మాటల్లో పదునుండేది కాదు. వాడి వేడి విమర్శలుండేవి కావు. దానికి కారణం అంతా అడ్జస్ట్‌మెంట్ రాజకీయం. జిల్లా మంత్రి నారాయణ రాజకీయ నాయకుడు కాదు. అతనికి రాజకీయంగా ఎట్లా మాట్లాడాలో కూడా తెలియదు. అప్పటికీ అతనిని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ బాగానే కలబెట్టాడు. ఆయనకు రాజకీయంగా లోతు తెలియక "నన్ను ఒక వైపే చూడండి... రెండోవైపు చూడాలనుకోవద్దు, మాడి మసైపోతారు' అంటూ సినిమా డైలాగ్‌లు వదిలాడు. నారాయణ భలే చిక్కాడురా అనుకుని అనిల్ కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు తమ విమర్శలతో మంత్రి బట్టలు విప్పదీసి రోడ్లో నిలబెట్టారు. రాజకీయ విమర్శలు ఎంత రోతగా ఉంటాయో అర్థం చేసుకున్న నారాయణ ఆ తర్వాత వాళ్ల జోలికి పోవడం మానుకున్నాడు.

(మిగతా 11వ పేజీలో)

# రైతుకు ఎరువు కరువు?



రైతులే దేశానికి వెన్నెముకగా నిలుస్తున్న భారతదేశంలో రైతులకు ఎప్పుడూ కష్టాలే! దేశ ప్రజల అవసరాలను రైతులు తీరుస్తున్నారు గాని వారి అవసరాలను, సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించే ప్రభుత్వాలు, పాలకులు రావడం లేదు.

వ్యవసాయానికి యుద్ధానికి ఈరోజు పెద్ద తేడా లేకుండా పోయింది. యుద్ధానికి పోతే తిరిగి ఇంటికి చేరుతామో లేదో తెలియదు. సేద్యం కూడా అట్లాగే అయ్యింది. పంట చేతికొస్తుందో లేదో తెలియని పరిస్థితి. ప్రభుత్వాలు గాని, ప్రకృతి గాని రైతులకు ఏ మాత్రం సహకరించడం లేదు. ప్రతియేటా ప్రకృతి రైతాంగాన్ని చిన్నచూపే చూస్తుంటుంది. వస్తే అతివృష్టి, లేదంటే అనావృష్టి. గత ఏడాది దేవుడు దయతలచి వానలు బాగానే పడ్డాయి. ప్రకృతి సహకరించింది. కాని పరిస్థితులు సహకరించాలిగా? అప్పోసొప్పో చేసి నాట్లు వేసుకున్న రైతులకు ఎరువుల బస్తాలు దొరకడం గగనంగా మారింది. జిల్లాలో 600దాకా ఎరువుల దుకాణాలున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన యూరియా బస్తా ధర 285రూపాయలుండగా, రైతులకు మాత్రం 330 రూపాయలకు అమ్ముతున్నారు. కొన్ని చోట్ల రైతులకు ఎరువులు దొరకడం లేదు. అసలు ఎరువులతో పాటు కొన్ని చోట్ల నకిలీ ఎరువులను కూడా అమ్ముతున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రస్తుతం జిల్లాలో ఎరువులకు డిమాండ్ ఎక్కువగా వుంది. అన్ని ప్రాంతాల లోనూ రైతులు ఎరువులను కొంటున్నారు. దీంతో కొందరు వ్యాపారులు ఎరువులను నల్లమార్కెట్‌లోకి పంపిస్తున్నారని తెలుస్తోంది. రైతులకు ఎరువులు సక్రమంగా అందేలా వ్యవసాయ శాఖాధికారులు చర్యలు చేపట్టాల్సివుంది.

కాగా, జిల్లాలోని రైతులు యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, యూరియా నిల్వలు పుష్కలంగా వున్నాయని వ్యవసాయ జేడీ హేమమహేశ్వరరావు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, ఎక్కడైనా అధికధరలకు యూరియాను విక్రయిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యూరియాను రైతులకు కొరత లేకుండా అందించేందుకు వ్యవసాయ శాఖ సిద్ధంగా వుందని స్పష్టం చేశారు.



# వడివడిగా నడికుడి

## • ముమ్మరంగా భూసేకరణ పనులు

మెట్ట ప్రాంతానికి వరంగా మారిన శ్రీకాళహస్తి – నడికుడి రైల్వేలైన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. జిల్లాలోని వెంకటగిరి, రాపూరు, పొదలకూరు, చేజర్ల, ఆత్మకూరు, వింజమూరు, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో రైల్వే అధికారులతో పాటు రెవెన్యూ అధికారులు కూడా భూసేకరణకు ముమ్మరంగా సర్వే నిర్వహించారు. త్వరలోనే ఈ లైన్ నిర్మాణ పనులు కూడా మొదలుపెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారు.

నడికుడి – శ్రీకాళహస్తి రైల్వేలైన్ నిర్మాణానికి నెల్లూరుజిల్లాలో రెండువేల ఎకరాల భూములను సేకరిస్తున్నట్లు నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ తెలిపారు. వింజమూరు మండలంలోని కాటేపల్లి రైల్వేలైన్‌కు సర్వే చేసిన భూములను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం వింజమూరులోని ఆర్ అండ్ బి బంగ్లాలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 11మండలాల ద్వారా రైల్వేలైను వెళుతుందన్నారు. అయిదు మండలాల్లో సర్వే పూర్తయిందన్నారు. త్వరలో పనులు పూర్తి చేస్తామన్నారు. భూములు కోల్పోయే రైతులకు నష్టపరిహారం అందజేస్తామన్నారు. మండలంలో 378ఎకరాల భూమి సేకరించాల్సి వుండగా 62.38ఎకరాల పట్టాభూములని, మిగిలినవి ప్రభుత్వ భూములన్నారు. వింజమూరు, చంద్రపడియ సరిహద్దుల్లో వింజమూరు రైల్వేస్టేషన్, రావిపాడు, గోళ్లవారిపాలెం వద్ద మరో రెండు స్టేషన్లు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. రైల్వేశాఖ బృందం త్వరలో కలెక్టర్ కార్యాలయంలో సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు. అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తామన్నారు. రైల్వేస్టేషన్ ఏర్పాటు చేసే ప్రాంతంలో 150మీటర్లు, మిగిలిన చోట్ల 50–55మీటర్లు భూమి సేకరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీఓ వెంకటరమణ, తహశీల్దార్ శ్రీరాములు, ఆర్ఐ మల్లికార్జున, సర్వేయర్ మస్తాన్‌బాషా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## సింహపురి సమాచారం

### హాస్టళ్లకు చంద్రన్న కానుకలు

నెల్లూరుజిల్లాలో ఇటీవల తెల్లరేషన్ కార్డుదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకల పేరిట ఆరు వస్తువులు పంపిణీ చేశారు. అయితే చాలా మిగిలిపోవడంతో ఆ సరుకులను ప్రభుత్వ హాస్టళ్లకు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాలో మిగిలిపోయిన 43వేల సంచులను వసతి గృహాలకు పంపిణీ చేయడానికి జిల్లాలోని పౌరసరఫరాల శాఖ సమాయత్తమవుతోంది. జిల్లాలోని బిసి హాస్టళ్లు 86, ఎస్సీ హాస్టళ్లు 118, ఎస్టీ హాస్టళ్లు 25 ఉన్నాయి. త్వరలో ఈ హాస్టళ్లకు చంద్రన్న కానుకలు అందనున్నాయి.

### ఆర్ఆర్‌బి పరీక్షకు ఉచిత శిక్షణ

ఆర్ఆర్‌బి పరీక్షకు ప్రభుత్వం ఉచితంగా శిక్షణ అందిస్తుందని, అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎపి బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత శిక్షణ కోసం బిసి, ఎస్సీ, ఎస్టీ తెగలవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మెరిట్ ఆధారంగా ఏపి బిసి స్టడీ సర్కిల్‌లో 60మందికి ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కుల ధృవీకరణ పత్రం ఆదాయ ధృవీకరణ పత్రం(లక్ష రూపాయల లోపు), పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేట్‌కు సంబంధించిన మార్కుల ధృవీకరణ పత్రం అందించాలన్నారు. నివాస స్థల ధృవీకరణ పత్రం, ఆర్ఆర్‌బి దరఖాస్తు చేసుకున్న రిజిస్ట్రేషన్ పత్రం, చదువుకు సంబంధించిన టిసి ఖచ్చితంగా ఇవ్వాలన్నారు. ఈ నెల 10వ తేదీ లోగా దరఖాస్తులను బిసి స్టడీసర్కిల్‌లో అంజేయాలన్నారు.

# న్యాయవిచారణ జరగాలి

నెల్లూరు ఒకటవ నగర పోలీస్ స్టేషన్ వద్ద గత నెల 30 రాత్రి జరిగిన దాడి, ఆందోళన ఘటనలపై న్యాయ విచారణ జరిపించాలని భారతీయ జనతాపార్టీ అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత విశ్వాసాలను, ఇతరుల మనోభావాలను కించపరిచేలా ఎవరు మాట్లాడినా ఖండించాల్సిందేనన్నారు. కాని జిల్లా ఎస్పీ ఎక్కడా మతాన్ని కించపరిచినట్లు మాట్లాడలేదన్నారు. మంచి ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థల గురించి చెప్పారని, అదే సమయంలో ఆర్ఎస్ఎస్ గురించి కూడా మాట్లాడారని తెలిపారు. ఎస్పీకి వ్యతిరేకంగా చేసిన ఆందోళన వెనుక బలీయమైన శక్తులున్నాయన్నారు. పోలీస్‌స్టేషన్, ఎస్పీ పైనే దాడి చేస్తే సామాన్య ప్రజలకు రక్షణ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. మతం ముసుగులో బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేసేవారిని ఉపేక్షించకూడదన్నారు. ఈ సమావేశంలో మైనార్టీ నాయకుడు ఖాసింబాషా, చిలకపాటి శ్రీనివాసులు, కాయల మధు తదితరులు పాల్గొన్నారు.

# వరద పరిహారం కోసం గళమెత్తిన నేతన్న

జిల్లాలో ఇటీవల కురిసిన భారీవర్షాలు, వచ్చిన వరదల ధాటికి నష్టపోయిన చేనేత కార్మికులను ఆదుకోవాలని, నేతన్నకు ఇస్తామన్న వరద పరిహారం వెంటనే అందివ్వాలంటూ పెద్దఎత్తున చేనేతకార్మికులు సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. వరద నష్టంతో ఎన్నో బాధలు పడుతున్నామని, తమను వెంటనే ఆదుకోవాలని వారు నినదించారు. గత కొద్దిరోజులుగా ఆ మేరకు తాము రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వరద బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.10వేల నష్టపరిహారం అందించి తమను నష్టాలనుంచి కష్టాల నుంచి కాపాడాలని కోరారు. జిల్లా కలెక్టర్ వచ్చి తమ గోడు విని తమకు చేయూతనందించాలంటూ నేత కార్మికులు కలెక్టరేట్ గేట్ వద్ద బైఠాయించారు. ఈ దశలో పోలీసులు కలుగజేసుకుని వారిని శాంతపరిచారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ దృష్టికి ఈ విషయం రాగానే, ఆయన వచ్చి నేతకార్మికుల నాయకులతో సంప్రదించి వారి సమస్యలు తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఇప్పటికే చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లివున్నారని, త్వరలోనే ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని హామీ ఇచ్చారు. దీంతో నేతకార్మికులు ఆందోళన విరమించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జేవివి సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరినాథ్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. చలపతి, చేనేత కార్మికసంఘం అధ్యక్షుడు కె.హేమసుందరరావు, నాయకులు పి.దశరథరామయ్య, ఎం.పార్థసారథి, సిపిఎం నాయకులు చంద్ర రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# మూతపడ్డ పరిశ్రమలు తెరుచుకోవచ్చు

నెల్లూరుజిల్లాలో మూతపడివున్న అన్ని రకాల పరిశ్రమలను మరలా పనిచేసే విధంగా తయారు చేసేందుకు కావలసిన అన్ని సౌకర్యాలను బ్యాంకుల ద్వారా, ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసేందుకు ఇటీవల కలెక్టర్ ఛాంబర్‌లో నిర్ణయం తీసుకోవడం జరిగిందని నెల్లూరుజిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు వొమ్మిన సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. యజమానులు మరలా పరిశ్రమలు ప్రారంభించేందుకు కావలసిన సహాయాన్ని వివరంగా జిల్లా పరిశ్రమల కేంద్రంలోని జనరల్ మేనేజర్ సుధాకర్‌కు అందజేయాలని కోరారు.

# విదేశీ పర్యటనకు ఐఆర్‌సిటిసి ప్యాకేజీ

విదేశీ పర్యటనకు మక్కువ చూపే ప్రయాణీకుల కోసం భారత ప్రభుత్వ రంగ సంస్థ, ఇండియన్ రైల్వే క్యాటరింగ్, టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్(ఐఆర్‌సిటిసి) ప్రత్యేక టూర్లను ఏర్పాటు చేసినట్లు సంస్థ తిరుపతి ప్రాంతీయ సేల్స్ మేనేజర్ మధుసూదనరావు తెలిపారు. సోమవారం నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఐఆర్‌సిటిసి సంస్థ కేవలం ప్రయాణీకులకు ఆహార సదుపాయాన్ని అందించడంతో పాటు విదేశీయాత్రలపై మక్కువ చూపే వారి కోసం ప్రత్యేక ప్యాకేజీలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ యేడాది మార్చి 3వ తేదీన థాయ్‌లాండ్ పర్యటనకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మార్చి 3న చెన్నై నుంచి బయలుదేరి 7వ తేదీ తిరిగి ప్రయాణీకులను చెన్నైకి చేర్చే వరకు మొత్తం మూడు రాత్రులు నాలుగు పగళ్లుగా యాత్ర సాగుతుందన్నారు. ఈ యాత్రకు వచ్చే ప్రయాణీకులకు పాస్‌పోర్టు ఉంటే సరిపోతుందన్నారు. వీసా, బీమా తదితర సౌకర్యాలన్నీ తమ సంస్థ చూసుకుంటుందన్నారు. యాత్ర సమయంలో ప్రయాణీకులకు 3స్టార్ హోటళ్లలో వసతి, ఏసి వాహనాలలో స్థల దర్శనం వంటి ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారు. బృందంగా వచ్చేవారికి ఒక్కొక్కరికి ఛార్జి రూ.38,131లు, వ్యక్తిగతంగా వచ్చే వారికి రూ.43,770లు ఛార్జీలుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తిగల ప్రయాణీకులు 9701360647, 9701360632 సెల్‌నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో స్టేషన్ సూపరింటెండెంట్ ఆంథోని జయరాజ్, ఐఆర్‌సిటిసి పర్యవేక్షణాధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

# బుచ్చిలో జాతీయస్థాయి నాటిక పోటీలు

బుచ్చిరెడ్డిపాలెంలోని 'కళాసాగర్' సంస్థ 31వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయస్థాయిలో నాటిక పోటీలు నిర్వహించేందుకు సంకల్పించింది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ పోటీలు నిర్వహించనున్నామని, ఏప్రిల్ 21 నుంచి 24వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయని ఆ సంస్థ అధ్యక్షుడు దొడ్ల రమణయ్యయాదవ్ తెలిపారు. పులగం దయాకర్‌రెడ్డి స్మారక జాతీయ స్థాయి నాటిక పోటీలుగా వీటికి నామకరణం చేశారు. నాటికలు తెలుగుభాషలోనే వుండాలని, నూతన రచనలకు, సమాజానికి సందేశం ఇవ్వడం, అవినీతిని ఎదుర్కోవడానికి అవసరమైన మార్గాన్ని సూచించడం వంటి ఇతివృత్తాలకు ప్రాధాన్యత వుంటుందని ఆయన పేర్కొన్నారు. దేశంలోని తెలుగు కళాకారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, తెలుగు నాటక రంగాన్ని ప్రోత్సహించాలనే సదాశయంతో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో అర్హత కలిగిన కళాకారులందరూ పాల్గొనవచ్చన్నారు. ఈ పోటీల్లో గత 30 ఏళ్ళుగా ప్రదర్శించిన నాటికలు నిషేధమని, పోటీలకు ఎంపికైన ప్రతి నాటికకు రూ.10 వేలు పారితోషికం వుంటుందని, ఉత్తమ నాటిక ప్రదర్శనకు నగదు బహుమతితో పాటు, శాశ్వత షీల్డ్‌ను బహుకరిస్తామని, వివరాలకు 9866800121 ఫోన్ నెంబరుకు సంప్రదించవచ్చని ఆయన వివరించారు.



## అమ్మా కలెక్టరమ్మా...

# రెడ్‌క్రాస్‌కు మోక్షం కల్పించారు




- **అనుబంధ సంస్థల్ని కూడా కాపాడండి**
- **పాతుకుపోయిన పాత కన్వీనర్ల కంపు వదిలించండి**
- **సేవాభిలాష వున్న యువ మేధావులకు అవకాశం కల్పించండి**

ఎంతోకాలంగా రకరకాల ఆరోపణలు, విమర్శల నేపథ్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ-నెల్లూరు శాఖకు ఎట్టకేలకు సుప్రశాంత వాతావరణంలో ఇటీవల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలు అప్రజాస్వామిక పద్ధతిలో నిర్వహించారని, మొత్తం ఓటర్లని ఓటింగ్‌లో పాల్గొననీయకుండా జీవిత సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకున్న వారికే ఓటుహక్కు వుంటుందని ఓ కిరికిరి పెట్టి పాత కమిటి వారు తమ తమ తెలివి తేటలన్నీ ఉపయోగించి మళ్ళీ వాళ్ళే కుర్చీలు ఎక్కేలా పథకం రచించారన్న ఆరోపణలు ఉన్నప్పటికీ ఎంతో సంయమనంతో వ్యవహరించి ఇక్కడ ఎన్నికలు సజావుగా జరిగేందుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్, అధికారయంత్రాంగం అభినందనీయులే. ఈ ఎన్నికల్లో గత పాలకవర్గమే మళ్ళీ విజయం సాధించడం విశేషం. గత. కొన్నేళ్ళుగా పాలనలో వున్న పాలకవర్గానికే ఓటర్లు మళ్ళీ పట్టం కట్టారు. దీంతో కొత్తగా ఎన్నికైన కార్యవర్గం రెడ్‌క్రాస్ బాధ్యతలను స్వీకరించింది.

అయితే, ఇదే సందర్భంలో రెడ్‌క్రాస్ అనుబంధ సంస్థల కన్వీనర్ల నియామకంలోనూ జిల్లా ఉన్నతాధికారులు తగు చొరవ తీసుకోవాల్సి వుంది. పాతవారి గుత్తాధిపత్యం నుంచి వీటిని కాపాడాల్సివుంది. రెడ్‌క్రాస్ అనుబంధ సంస్థల్లో బ్లడ్‌బ్యాంక్, క్యాన్సర్ ఆసుపత్రి, స్పాస్టిక్ సెంటర్, జనరిక్ మందుల షాపు, కుక్కకాటు చికిత్సకై ఏర్పాటుచేసిన విభాగం, హెచ్‌ఐవి క్లినిక్, ప్రకృతి వైపరీత్యాల విభాగం, పినాకినీ గాంధీ ఆశ్రమం వంటి ప్రతిష్టాత్మక విభాగాలు వున్నాయి. ప్రజలకు అనునిత్యం సేవచేసే ఈ శాఖలు రెడ్‌క్రాస్ అనుబంధ విభాగాలుగా వుండడంతో వీటికి ఎంతో ప్రాధాన్యత వుంది. ముఖ్యంగా, సేవా భావమే ప్రధానంగా వున్నవారు, ప్రజాసేవ పట్ల ఎంతో ఆసక్తి వున్నవారు ఈ అనుబంధ సంస్థల్లో వుంటే వారి నిష్కళంక సేవతో ఈ విభాగాలు మరింతగా రాణిస్తాయి. అయితే, ఈ ప్రతిష్టాత్మక అనుబంధ సంస్థల్లో ఎంతో కాలంగా కొంతమంది వ్యక్తులే ఏళ్ళ తరబడి తిష్టవేసుకుని కూర్చొని కర్ర పెత్తనం చెలాయిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. ఎంతోకాలం నుంచి తామే ఈ సంస్థలను ఉద్ధరిస్తున్నామన్నట్లు కేవలం గొప్పలు చెప్పుకుని కాలం గడిపేసుకునేవారి కంటే, ఆచరణలో అనునిత్యం సేవాభావంతో సేవచేసే వారికే ఇలాంటి సంస్థల కన్వీనర్లుగా అవకాశం ఇవ్వడం సముచితం. అందులోనూ రెడ్‌క్రాస్ వంటి సమాజ సేవా సంస్థల్లో సమాజం పట్ల బాధ్యత, సమాజ సేవ పట్ల ఆసక్తి, ఉన్నతాశయాలు కలిగినవారు వుంటే, అకుంఠిత దీక్షతో అంకితభావంతో పనిచేసేవారుంటే ఆయా సంస్థలకు కొత్త వెలుగులు వస్తాయన్న విషయం అందరికీ తెలిసిందే. అలా కాక, ఎంతోకాలంగా పాతుకుపోయిన వారినే పట్టుకుని వేలాడినందువల్ల కొత్తగా ఒరిగే ప్రయోజనమేమీ వుండదనేది ప్రత్యేకించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే, ప్రపంచవ్యాప్తంగా ఆధునిక సాంకేతిక, శాస్త్ర పరిజ్ఞానం శరవేగంగా విస్తరిస్తున్న నేటి రోజుల్లో, ముఖ్యంగా వైద్యరంగంలో, సమాజ సేవా రంగంలో అత్యంత ఆధునిక పద్ధతులు కొల్లలుగా అందుబాటులోకి వచ్చిన నేటికాలంలో..ఇంకా పాతకాలపు పద్ధతులతోనే సంస్థలను నడుపుకోవడం కంటే..ఆధునిక పరిజ్ఞానం, సమాజ సేవాభిలాష, ఉన్నతమైన చదువులు.. మంచి జ్ఞాన పరిణితి కలిగిన యువతకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ఇలాంటి ప్రతిష్టాత్మక సేవాసంస్థలు మరింతగా పురోగమించేందుకు, తద్వారా ప్రజలకు మరింతగా సేవలు చేసేందుకు దోహదం చేసినట్లవుతుంది. ఈ కొత్త యేడాదిలో స్వార్థపూరితమైన పాత కన్వీనర్ల కంపు వదిలించి జిల్లా ఉన్నతాధికారులు ఈ అనుబంధ సంస్థల్లో సమాజసేవాభిలాషతో వున్న యువతకు మంచి ప్రాతినిధ్యం ఇచ్చేందుకు కృషి చేస్తారని ఆశిద్దాం!...

## శ్రీసిటీలో కోల్గేట్ టూత్‌బ్రష్ ఫ్యాక్టరీ



శ్రీసిటీలోని కోల్గేట్-పామోలివ్ సంస్థ తమ టూత్‌బ్రష్‌ల ఫ్యాక్టరీని బుధవారం లాంఛనంగా ప్రారంభించింది. ఆ సంస్థ దక్షిణ ఆసియా రీజియన్ వైస్‌ప్రెసిడెంట్ ఇస్సామ్ బచ్చాలాని సమక్షంలో యూరోప్ రీజియన్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఫెబియన్ టి గార్సియ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోల్గేట్‌కు చెందిన ప్రపంచ వ్యాప్త ఉన్నతశ్రేణి అధికారులు, ఏపిఐఐసి ఛైర్మెన్ డాక్టర్ పి.కృష్ణయ్య, శ్రీసిటీ ఎండి రవీంద్ర సన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో 25 ఎకరాల విస్తీర్ణంలో 450కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన కోల్గేట్ పరిశ్రమ ఏడాదికి 220మిలియన్ల టూత్‌బ్రష్‌ల తయారీ సామర్థ్యం కలిగివుంది. ఏడాదికి 600మిలియన్ల బ్రష్‌ల తయారీ లక్ష్యంగా త్వరలో యూనిట్ విస్తరణ జరుగనుంది. ఈ పరిశ్రమ ద్వారా 1200మందికి ఉద్యోగాలు లభిస్తాయని తెలుస్తోంది.

## ఉత్తమ పరిపాలక సంస్థ - 2015గా డాక్టర్ రెడ్డీస్

➢ **అవార్డు అందుకున్న జి.వి.ప్రసాద్**



ఏషియన్ సెంటర్ ఫర్ కార్పొరేట్ గవర్నెన్స్ అండ్ సస్టైనబులిటి సంస్థ ప్రతియేటా ఉత్తమ లీడర్‌షిప్, కార్పొరేట్ గవర్నెన్స్, సస్టైనబులిటి మరియు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సబులిటి విభాగాలలో ఇచ్చే ప్రతిష్టాత్మక అవార్డుల వేడుక ఫిబ్రవరి 3వ తేదీ ముంబయిలోని బి.యస్.సి. ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. ఈ అవార్డుల వేడుకలో మన నెల్లూరీయుడు జి.వి.ప్రసాద్ డా॥రెడ్డీస్ పక్షాన ఉత్తమ పరిపాలక సంస్థ-2015గా తమ సంస్థకు వచ్చిన అవార్డును అందుకున్నాడు. డా॥ రెడ్డీస్ సిఇఓ హోదాలో ఆయన ఈ అవార్డును స్వీకరించాడు. యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ఐఐఆర్‌సి ఛైర్మెన్ ప్రొఫెసర్ మెర్విన్‌కింగ్, ఏషియన్ సంస్థ వ్యవస్థాపకుడు అశోక్‌చౌహాన్‌ల చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నాడు. జి.వి.ప్రసాద్ నాయకత్వంలోని రెడ్డీస్ సంస్థ అంతర్జాతీయ వ్యాపార రంగంలో అవలంభిస్తున్న విధానాలు పరిపాలక సరళి తదితర అంశాలలో వారు చూపిస్తున్న ప్రతిభకు గుర్తుగా ఈ అవార్డు లభించింది. గ్రీన్‌పార్క్ హోటల్స్ వ్యవస్థాపకులు గునుపాటి హరిశ్చంద్రారెడ్డి-శ్యామలమ్మల కుమారుడు, నెల్లూరీ యుడు జి.వి.ప్రసాద్‌కు నెల్లూరీయుల పక్షాన 'లాయర్' అభినందనలు.

## ఉత్సాహంగా 'రత్నం' క్రీడా సంబరాలు






నెల్లూరు సరస్వతీనగర్ లోని డా॥ కిషోర్స్ రత్నం కిడ్స్ & రేస్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల క్రీడా దినోత్సవం ఈ నెల 2న ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఘనంగా నిర్వహించారు.

విద్యార్థుల క్రీడా విన్యాసాలు, హూప్స్ ప్రదర్శన, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన చూపరులను అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా డైరెక్టర్స్ డా॥ కె.కృష్ణకిషోర్, శ్రీమతి వాసంతి కిషోర్‌లు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం క్రీడలలో విజేతలకు బహుమతులను అందించారు.

ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రామమూర్తినాయుడు, సీనియర్ మేనేజర్ రాజేష్ బాబు, కిడ్స్ ప్రిన్సిపాల్ శ్రీమతి లక్ష్మీ, రేస్ ఇంటర్నేషనల్ ప్రిన్సిపాల్ శ్రీమతి రేవతి, సీనియర్ అడ్మినిస్ట్రేటర్స్ సురేష్, రుక్మిణి, సునీల్ కుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పెద్దసంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు.



## 'ప్రభా'తం

అదేమి దురదృష్టమో తెలియదు కానీ, ఏ పాపం తెలియని మేము అభంశుభం తెలియని అనేకమంది ప్రయాణీకులను, అందులో చిన్నారులను, ఎందరో తల్లులను.. పెద్దలను అందరినీ సురక్షితంగా గమ్యం చేర్చాలని అహోరాత్రులూ చక్రాలరిగేలా పరుగులు పెడుతుంటే.. ఎవరో కొందరు గుర్తుతెలియని దుండగులు ఒక్కసారిగా మామీద పడి దాడి చేసి, అమానుషంగా మా అద్దాలు పగులగొట్టి, మా గుండెలను ముక్కలు చేసి, ఇంకా కోపం తీరక.. మేమెంతో అందంగా అమర్చుకున్న బోగీలను కూడా తగులబెట్టి..హాయిగా నిద్రపోతున్న ప్రయాణీకులను భయభ్రాంతుల్ని చేసి..కిరాతకుల్లా వ్యవహరిస్తారే..ఇదేనా న్యాయం?..మీ కోసం పరుగులు తీసే మమ్మల్ని నిర్దాక్షిణ్యంగా తగులబెడతారా?..వేల కిలోమీటర్ల దూరాన్ని కూడా మీకెలాంటి అపాయం లేకుండా మేం సులభంగా సురక్షితంగా మీరు కోరుకున్న గమ్యానికి చేర్చుతున్నామే..మమ్మల్నా మీరు కాల్చేది?..మా పైనా మీ ప్రతాపం. మేం ఏ పాపం చేశామని మాకీ శాపం?..మీ కోసం కదిలొచ్చే మామీద మీకెందుకంత కక్ష?..ఇదేనా మీ న్యాయం?..ఇదేనా మీ రీతి?..అసలు మీ నరజాతికి వున్నదా నీతి?...అని ఏ రైలుమాతల్లికో నోరొచ్చి అడిగితే మనమేం జవాబివ్వగలం?..ఒక్క రైలే కాదు..బిక్కుబిక్కుమంటూ వెళ్తూన్న ఓ ఆర్టీసి బస్సు..నాయనలారా!..మీకోసం వచ్చే నా మీద మీరెందుకు రాళ్ళేస్తున్నారు?..నా అద్దాలెందుకు పగులగొడుతున్నారు?..నేను చేసిన తప్పేమిటి అని అడిగితే..మనం ఏ సమాధానం చెప్పగలం?...ఎవరి ఆందోళనలకో, ఆగ్రహాలకో.. భీకర గర్జనలకో ప్రభుత్వ వాహనాలు ధ్వంసం కావడం, ప్రజల ఆస్తులు విధ్వంసానికి గురికావడం ఏమిటిదంతా?..మొత్తంగా ఈ ఘటనల్లో మట్టి పాలవుతున్నది ప్రజాధనమే కదా?...నోరులేని వాహనాలను తగులబెట్టి, తద్వారా ప్రజల్ని భీతావహుల్ని చేయడం ద్వారా అరాచక శక్తులారా మీరు సాధించేదేమిటి?.. బాధితుల హాహాకారాలు, చిన్నబిడ్డల ఆర్తనాదాలు, తల్లుల రోదనలతో మీ కోపం చల్లారుతుందా?..ఆ తల్లులో చెల్లెళ్ళో ఆ బాధితుల్లో పొరపాటునో గ్రహపాటునో మీవారెవరైనా వుంటే?... మీవారిని మీరే అన్యాయంగా బాధితుల్ని చేస్తే మీ పరిస్థితి ఏమిటి?... అని ఏ బస్సో, రైలో ఆవేదనగా మనల్ని ప్రశ్నిస్తే.. అందుకు మన జవాబేమిటి?... అసలు మనం ఎటు పోతున్నాం?.. ఎక్కడ నుంచి ఎక్కడికి మన ప్రస్థానం. మనుషుల్లో రానురాను మానవత్వం లోపిస్తోందా?.. అసలే విభజనతో రాష్ట్రానికి జరిగిన నష్టం, కలిగిన కష్టం..ఆనాటి కన్నీటి చారికలు ఇంకా ఇంకిపోలేదే?.. అన్నీ మరచిపోయామా? ఆ కష్టాలనుంచి, కన్నీళ్ళ నుంచి రాష్ట్రం ఎప్పటికి కోలుకోవాలి?.. ఎన్ని వేల కోట్ల అప్పులో.. అయినా... బయటపడేదెప్పుడో?.. కనీసం మనకంటూ పూర్తిస్థాయిలో ఓ రాజధాని కూడా లేని దుర్గతి?.. చెప్పుకునేందుకు ఎలాంటి ప్రగతి కానరాని దుస్థితి?.. ఇదే కదా ఇప్పుడు మనమున్న పరిస్థితి. అయినా, ఇటీవలి కాలంలో రాష్ట్రంలోనే కాదు, దేశంలోనే పరిస్థితులు ఆశాజనకంగా, శుభకరంగా వుంటున్నాయి. చేజారిపోయిందనకున్న ప్రగతి దారి తిరిగి దొరికిందనే అనుకోవచ్చు. గతంలో వున్న అస్తవ్యస్త పరిస్థితులన్నిటినీ చక్కదిద్దుకుంటూ, మళ్లీ పునర్వైభవం సంతరించుకోవాలని దేశం పురోగమిస్తున్న శుభవేళ..శాంతి సహనంతో అలరారే దేశంగా ప్రపంచవ్యాప్తంగా భరతజాతి ఖ్యాతి దశదిశలా మార్మోగుతున్న వేళ..ఉన్నట్లుండి ఏదో ఒక ప్రాంతంలో చెలరేగే అరాచకాలు..వాటివల్ల బాధపడే బాధితుల ఆర్తనాదాలు ప్రజల హృదయాలను తీవ్రంగా కలచివేస్తూనే వున్నాయి. రాష్ట్రంలోనూ ఇలాంటి పరిస్థితి అక్కడక్కడా కనిపిస్తుండడం ఎంతో బాధాకరం. ఎంతో సుప్రశాంతమైన ప్రాంతమని మన రాష్ట్రానికి వేలకోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు, తద్వారా రాష్ట్రాన్ని పారిశ్రామికరంగంలో మరింత తేజోవంతం చేసేందుకు వివిధ ప్రాంతాల పారిశ్రామిక దిగ్గజాలు ఎంతో సంతోషంగా ఇక్కడికి విచ్చేస్తున్న వేళ..ఎక్కడో ఒక పెద్ద అరాచకం అందరినీ భీతావహుల్ని చేస్తోంది. ఎందు కిదంతా?..మన ఆందోళనలు మనల్నే ఆందోళనకు గురిచేస్తే ఎలా?..మన గర్జనలకు మనమే భయపడే దుస్థితికి రావడం ఎంత దయనీయం?..సమస్యలపై ఎవరైనా సరే న్యాయమైన విధంగా, శాంతియుతంగా ఆందోళన చేయవచ్చు గానీ, ఆందోళనలను అడ్డుపెట్టుకుని అరాచకశక్తులు అమాయకులపై దాడులు చేయడాన్ని ఏమనుకోవాలి?.. దుండగులు అదే అదనుగా.. అదేపనిగా బస్సులను, రైళ్ళను కనిపించిన వాహనాలన్నిటినీ తగులబెట్టడాన్ని ఏమనాలి?.. అసాంఘికశక్తులు చివరికి పోలీసు స్టేషన్‌లపై, పోలీసులపై కూడా దాడికి సిద్ధపడితే.. రక్షకులకే రక్షణ లేని దుస్థితిని కల్పిస్తే.. ఇక సామాన్యుల గతేమిటి?.. అందులోనూ పిల్లాపాపలతో ఎక్కడినుంచి ఎక్కడికో వెళ్తున్న రైలు బోగీలకు కూడా అడ్డుపడి, మధ్యలోనే వాటిని దగ్ధం చేయడం ఘోరమైన పాపం కాదా?.. ఇలాంటి అమానుషాలు ఏ ఒక్క ప్రాంతంలోనో కాదు, అప్పుడప్పుడూ పలు ప్రాంతాల్లో తరచూ జరుగుతూనే వుండడం బాధాకరం. ప్రభుత్వాలు ఇకనైనా ఇలాంటి అరాచకశక్తుల పట్ల కఠినంగా వుండాలి. అమానుషం విజృంభిస్తే చివ రికి సమాజంలో అరాచకమే తప్ప ప్రశాంతత ఎక్కడ వుంటుంది?.. సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకునేందుకు మార్గాలు బోలెడు. అంతే తప్ప, ఎవరైనా సరే..ఆందోళనలను అడ్డుపెట్టుకుని అరాచకత్వంతో అమానుషంగా ప్రవర్తించడం ఎంతమాత్రం క్షంతవ్యం కాదు. నీడనిచ్చే చెట్టును నరికేసుకుంటే..చివరికి నిల్చోడానికి చోటుండదు. అరాచకత్వానికి చోటిస్తే చివరికి మానవత్వానికి చిరునామాయే వుండదు. ఏ ఆందోళనలైనా సరే, శాంతియుతంగా వుండాలే తప్ప అరాచకశక్తులకు ఆటపట్టు కాకూడదు. అసలు, ప్రజాసంక్షేమం కోసం వున్న బస్సులను, రైళ్ళను ధ్వంసం చేయడం ఎంతమాత్రం తగదు. అలాంటి ఘటనలు ఎక్కడ జరిగినా ప్రజాస్వామ్యానికే కాదు, మానవత్వానికే మాయని మచ్చలని చెప్పక తప్పదు.



### ఇదేమి న్యాయం?

ఎవరెంతటివారైనా సరే .. అరాచ కత్వంతో అమాయక ప్రజల పట్ల అమానుషంగా ప్రవర్తించడం ఎంత మాత్రం క్షంతవ్యం కాదు. ఆందోళనలను అడ్డుపెట్టుకుని అరాచకశక్తులు కొందరు బస్సులను, రైళ్లను తగులబెట్టడం మరీ ఘోరం.. దారుణం. నీడనిచ్చిన చెట్టును నరికేసుకుంటే.. చివరికి నిల్చోడానికి ఎవరికీ చోటుండదు. అరాచకత్వానికి చోటిస్తే చివరికి మానవత్వానికి చిరునామా వుండదు. అరాచక ఘటనలు ఎక్కడ జరిగినా అవి ప్రజాస్వామ్యానికే కాదు, మానవత్వానికీ మాయని మచ్చలే!..

# నాటుసారాపై వేటు



ఒక కార్యాచరణ ప్రణాళిక ప్రకారం నెల్లూరు జిల్లాలో గుర్తించిన 18గ్రామాలలో నాటుసారా ఉత్పత్తిగాని, సరఫరా గాని, త్రాగడం గాని నిషేధించడానికి చర్య తీసుకోవడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి అన్నారు.

సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని గోల్డెన్‌జూబ్లీ సమావేశ మందిరంలో నాటుసారా నిషేధ కార్యక్రమమైన నవోదయ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో బోగోలు, అల్లూరు, దగదర్తి, వెంకటగిరి, డక్కిలి, కావలి మండలాల్లో నాటుసారాకు సంబంధించి 18గ్రామాలను గుర్తించడం జరిగిందన్నారు. వాటిలో బోగోలు మండలంలో కప్పరాళ్లతిప్ప, నాగులవరం, చెంచులక్ష్మీపురం, తాళ్లూరు, బోగోలు, కావలి మండలంలోని కావలి టౌన్, అల్లూరు మండలంలోని మూర్తిరాజుసంగం, అల్లూరుపేట, సింగపేట, ఉడ్‌హౌస్‌పేట, దగదర్తి మండలంలోని ఉలవపాళ్ల, అనంతవరం, దామవరం, వెంకటగిరి మండలంలో బ్యాండుపాలెం, ఎగువపాలెం, అరవపాలెం, నాగులగుంట, డక్కిలి మండలంలోని డి.వడ్డిపల్లి వున్నట్లు తెలియజేశారు. వాటిని మొత్తం మూడు గ్రేడులుగా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ క్రోడీకరించడం జరిగిందన్నారు. ఎ గ్రేడులో బోగోలు మండలంకు చెందిన కప్పరాళ్లతిప్ప గ్రామంలో అత్యధికంగా నాటుసారా ఉత్పత్తి జరుగుతున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. అదేవిధంగా బి.గ్రేడు కింద బోగోలు మండలంలోని నాగులవరం, వెంకటగిరి మండలంలోని బ్యాండుపాలెం వున్నట్లు ఆ రెండు గ్రామాలు నాటుసారా ఉత్పత్తిలో, పంపిణీలో రెండవ స్థానంలో వున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. మిగతా 15గ్రామాల్లో ఈ నాటుసారా సరఫరా అవుతుందని, ఈ మొత్తాన్ని మార్చి 31వ తేదీలోపు పూర్తిగా నివారించాలన్నారు. నాటుసారా కాసేవారిపై కఠినంగా వ్యవహరించాలని, వారిపై బైండోవర్ కేసులతో పాటు అవసరమైతే పిడి యాక్ట్‌ను ఉపయోగించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. నెల్లూరుజిల్లాలో అన్ని శాఖల అధికారుల సహకారంతో నాటుసారా పూర్తిగా నిషేధించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నవోదయ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.ఎండి. ఇంతియాజ్, గూడూరు సబ్‌కలెక్టర్ గిరీషా పి.ఎస్, కావలి ఆర్‌డిఓ నరసింహన్, ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ సహాయ కమిషనర్ జి.చెన్నకేశవరావు, స్వచ్ఛంద సేవాసంస్థల వారు, సామాజిక సేవా కార్యకర్తలు మరియు ఎక్సైజ్ శాఖ సిబ్బంది, రెవెన్యూ, మండల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.




## కఠినచర్యలు తీసుకోవాలి

ఆందోళనల సమయంలో ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఆస్తులను ధ్వంసం చేసిన ఆందోళనకారులను గుర్తించి, నష్టానికి ప్రతిఫలంగా వాళ్ల ఆస్తులను జప్తు చేయాలి. ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా ప్రకటించాలి. ఒకవేళ ఆస్తులు లేకపోతే జీవితాంతం పనిచేసి నష్టపరిహారం కట్టేలా జైళ్లలో వేసి పనులు చేయించాలి. కులం పేరుతో 'తుని'లో జరిగిన దుర్మార్గాన్ని ఎవరూ సహించకూడదు. శాంతియుత మార్గంలో ఉద్యమాలు చేయడానికి ఎన్నో మార్గాలున్నాయి. హింసోన్మాదానికి ప్రభుత్వం తలవంచితే, రేపు ఇంకొక కులం వాళ్లు కూడా ఇదే దారి పడతారు.

**– సాగర్.పి.వి., చీరాల.**

## రాహుల్‌కు ఇంకేం పనిలేదా?

రోహిత్ లాంటి విద్యార్థులు చాలామంది ఈ దేశంలో ఆత్మహత్యలు చేసుకున్నారు. రాహుల్ గాంధీ గాని, అరవింద్ కేజ్రీవాల్‌లు గాని అక్కడకు వచ్చి పరామర్శించిన దాఖలాలు లేవు. రోహిత్ మీద రాహుల్‌కు అంత ప్రేమెందుకొచ్చిందో కూడా అర్థం కావడం లేదు. రోహిత్‌ది కులపరమైన ఆత్మహత్య కాదు. కాని దీనికి కులగజ్జినంటించారు. కేవలం రెండు సిద్ధాంతాల మధ్య ఘర్షణ నేపథ్యంలో జరిగిన సంఘటనను కులాల పోరుగా చిత్రీకరిస్తూ రాహుల్, అతని బృందం ఆడుతున్న రాజకీయ నీచానికి జాతి సిగ్గుతో తలదించుకుంటోంది.

**ఇండ్ల రమేష్, నెల్లూరు.**

## కృష్ణారావు నియామకం అభినందనీయం

బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మెన్‌గా ఐవైఆర్ కృష్ణారావును నియమించడం అభినందనీయం. మేధావి, సాంప్రదాయ బద్ధుడు, నిజాయితీపరుడు, పదహారణాల బ్రాహ్మణుడు. పేరుకు బ్రాహ్మణులు అగ్రకులాల వాళ్లు, ఐ.టి రంగం లేకుంటే వీళ్లు భిక్షగాళ్లే! రిజర్వేషన్ పరంపరలో ఈ కులానికి తీరని అన్యాయం జరుగుతోంది. బ్రాహ్మణులు పౌరోహిత్యం చేస్తూ, వంటలు చేస్తూ బ్రతుకుతున్నారు. పేదబ్రాహ్మణుల కోసం కృష్ణారావు కృషి చేయాలి.

**– వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## పోలీసులెలా పని చేయాలి?

పోలీసు వ్యవస్థ పనే చేయడం లేదని విమర్శిస్తుంటాం. ప్రతి అంశంలోనూ వారి చేతులకు సంకెళ్ళు బిగించి పనులు చేయమంటే ఎలా చేస్తారు. ఏ కులం వారిని ఇబ్బంది పెట్టకూడదు, ఏ వర్గం వారి మనోభావాలు దెబ్బతినకూడదు, సున్నితమైన అంశాలపై సమయస్ఫూర్తిగా వ్యవహరించాలి. ఇవన్నీ పోలీసులే చేయాలంటే ఎలా? అసలు పోలీసుల బదిలీలను రాజకీయ నాయకులు నిర్ణయించడమేంటి? రాజకీయ శక్తుల నుండి పోలీసు వ్యవస్థకు విముక్తి కల్పిస్తేనే సమాజం బాగుపడుతుంది. **– దండే సుధాకర్, నెల్లూరు.**





# ప్రాణాంతక ప్రయాణం

▲ 200కిపైగా ఆటోలు, 2000కి పైగా ప్రాణాలు

***"అపాచి"... నెల్లూరుజిల్లా తడ ప్రాంతంలో అడిడాస్ బూట్లు తయారు చేసే కంపెనీ ఇది. ఇక్కడ రోజుకి సుమారు 8500మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరంతా సమీప గ్రామాల నుండి షిఫ్టుల వారీగా పని చేయడానికి ఇక్కడికి వస్తారు.***

తడ పరిసర ప్రాంతాల గ్రామాలతో పాటు ఎక్కువగా సూళ్లూరుపేట, సత్యవేడు, వరదయ్యపాళెం, దొరవారిసత్రం, నాయుడుపేటల నుండి సుమారు 2000మంది ఇక్కడ డే షిఫ్టులో పని చేస్తారని సమాచారం. అయితే వీళ్ళంతా ఉదయం 7.30కి బయలుదేరి 8.30కంతా ఫ్యాక్టరీకి చేరుకుని మళ్ళీ రాత్రి 7.30కి బయలుదేరి 8.30ప్రాంతంలో తమ ఇళ్ళకు చేరుకుంటారు. అయితే వీరి ప్రయాణం ఎంత ప్రమాదకరంగా వుంటుందో చూడడానికే కాదు వినడానికి సైతం దడ పుడుతుంది.

పన్నెండేళ్ళ బాలబాలికల నుండి 50కి పైబడిన వయసువాళ్ళు కూడా ఈ బూట్ల కర్మాగారంలో రోజువారీ కూలీలుగా పని చేస్తున్నారు. వీళ్ళందరినీ యంత్రాల్లా వాడుకుంటున్న యాజమాన్యం వీళ్ళకి సరయిన వసతులు కల్పించడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందనడానికి పెద్ద ఉదాహరణగా వారి రవాణా వ్యవస్థని పేర్కొనవచ్చు. 8500మంది ఉద్యోగులు పనిచేసే సంస్థకి కేవలం 11బస్సులు మాత్రమే ఉన్నాయంటే ఎంతటి దారుణమైన విషయమో మనం ఊహించుకోవచ్చు. పొట్ట కూటి కోసం వచ్చే కార్మికులను మీ చావు మీరు చావండని గాలికి వదిలేసి వారి ప్రాణాలతో చెలగాటమాడుతోంది "అపాచి".

ఉదయం 7.30 గంటల ప్రాంతంలో ఆటోలన్నీ వివిధ ప్రాంతాల నుండి ఒకేసారి బయలుదేరుతాయి. ఒక్కొక్క ఆటోలో వెనుకవైపు నలుగురు మధ్యలో ఎనిమిది మంది డ్రైవర్‌కి ఇరువైపులా ఇద్దరిద్దరి చొప్పున నలుగురు అంటే ఒక్కో ఆటోలో 16మంది కూర్చుంటున్నారు. డ్రైవర్‌తో సహా నలుగురికి మాత్రమే అనుమతి వున్న ఆటోలో 16మందిని కూర్చోబెడుతున్నారంటే ఇది ఎంతటి ప్రమాదకరమైన విషయమో అర్థమౌతుంది. ఉదయం, రాత్రి వేళల్లో ఇన్ని వందల ఆటోలు జాతీయ రహదారిపైన వెళ్ళాలంటే అది ఎంతటి ప్రాణాంతక ప్రయాణమో తలుచుకుంటుంటేనే భయమేస్తోంది.

ఇంత జరుగుతుంటే అటు పోలీసు వ్యవస్థ గానీ, ఇటు రవాణా వ్యవస్థగానీ కళ్ళు మూసుకుని వుండడం విడ్డూరం. "అపాచి" నుండి అనధికార జీతాన్ని గీతంగా అందుకుంటూ బూట్ల తయారీ కర్మాగార యాజమాన్యం తమ కార్మికులను బూట్ల కంటే హీనంగా చూస్తుంటే చోద్యం చూస్తున్న అధికారులు ఏ స్థాయిలో అపాచీకి అమ్ముడుపోయారో అర్థమౌతుంది. అపాచీ యాజమాన్యంతో ఆర్థిక లావాదేవీలు కుదరక నానా రాద్ధాంతం చేసిన గత ఎంపికి, ప్రతిపక్ష పార్టీలో వున్న ప్రస్తుత ఎంపికి ఈ ఘోరం కనపడదేమో. తడ దారిలో ఇలా దడదడమంటూ పోతున్న ఆటోలు ఏ నిముషమైనా ప్రమాదానికి గురికావచ్చు! వందల ప్రాణాలు గాలిలో కలిసిపోవచ్చు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం మాని... వెంటనే ఈ విషయమై గట్టి చర్యలు చేపట్టి కార్మికులకు సరైన వాహన సౌకర్యాన్ని కల్పించి ప్రమాదాలు జరగకుండా వారిని కాపాడాల్సిన బాధ్యత పాలకులపై వుంది. కార్మికులకు బస్సుల సౌకర్యం కల్పించడం అపాచి సంస్థకు సాధ్యం కాకపోతే, కనీసం ఆర్టీసీ బస్సుల ద్వారానైనా వీరికి రవాణా సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది. తద్వారా ఆర్టీసీకి కూడా ఆదాయం చేకూరుతుంది.

## అహంకార ధోరణిలో 'అపాచి' యాజమాన్యం

### - ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



ఈ విషయమై సూళ్లూరుపేట స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను "లాయర్" సంప్రదించినప్పుడు ఆయన ఆసక్తికర సమాధానం చెప్పాడు. రవాణా సౌకర్యంతో పాటు కార్మికులకు సంబంధించిన పలు సమస్యలపై అనేకసార్లు అపాచి యాజమాన్యాన్ని సంప్రదించే ప్రయత్నం చేయగా వారు అహంకార ధోరణితో వ్యవహరించడమే కాకుండా, తమకు ముఖ్యమంత్రి, డిజిపిల స్థాయిలో ఆశీస్సులున్నాయని, స్థానిక నాయకుల సలహాలు, సూచనలు అవసరం లేదని చెప్పడం బాధకలిగిస్తుందని... ఈ విషయమై ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్ళినప్పుడు విదేశీ సంస్థలు కోట్ల రూపాయలు పెట్టుబడులు మన రాష్ట్రంలో పెడుతున్నాయని, వాటి విషయంలో చూసీచూడనట్లు వ్యవహరించాలని సాక్షాత్తూ ముఖ్యమంత్రే చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాధ్యమైనంత త్వరలో కార్మికులకు మంచి రవాణా సౌకర్యం కల్పిస్తే బాగుంటుందని, ఈ విషయమై తాను ఖచ్చితంగా పోరాడుతానని చెప్పారు.

# దేశంలో ముగ్గురు... వైకాపాకు ఒకరు?



కొన్నేళ్ల క్రితం వరకు ఒకే బాట ఒకే మాట అన్నట్లుగా సాగిన ఆనం సోదరులు నలుగురు ఇప్పుడు మూడు దారులయ్యారు. ఎవరి దారి వారిది, ఎవరి పంథా వారిదే అన్నట్లుగా సాగుతున్నారు. 2014ఎన్నికలకు ముందుదాకా కూడా కాంగ్రెస్‌లోనే వున్న నలుగురు అన్నదమ్ములు ఆ తర్వాత చెల్లా చెదురయ్యారు. అన్నలతో విభేదించిన మూడో తమ్ముడు ఆనం జయకుమార్‌రెడ్డి మొదట జైసమైక్యాంధ్ర పార్టీలోనూ, ఆ తర్వాత తెలుగుదేశంలోనూ చేరడం తెలిసిందే! ఇక నెంబర్ 1, 2లైన ఆనం వివేకానందరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలు మొన్ననే తెలుగుదేశంలో చేరారు. ఇక కాంగ్రెస్‌లో మిగిలివున్నది నాలుగో తమ్ముడైన ఆనం విజయకుమార్‌రెడ్డి. సోదరులతో కలిసి ఆయన తెలుగుదేశంలో చేరతాడని అనుకున్నారు. కాని ఆయన వాళ్ల వెంట నడవలేదు. తెలుగుదేశంలో చేరడానికి ఆయన మనసు ఒప్పుకోలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఎలాగూ జీవం చచ్చిపోయింది కాబట్టి వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరాలనుకున్నాడు. ఆయన మనసును పసిగట్టిన వైకాపా జిల్లా నాయకులు ఆయన ఇంటికెళ్లి పార్టీలోకి రమ్మని ఆయనను ఆహ్వానించడం, ఆయన అనుచరులతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని చెప్పడం అయ్యింది. ఇదంతా కూడా నాయకుల పార్టీ ప్రవేశానికి ముందు జరిగే ఓ లాంఛన ప్రక్రియే. వైకాపాలో ఆనం విజయకుమార్‌రెడ్డి చేరే తేదీ ఏదో నిర్ణయం కావడమే మిగిలివుంది.

ఆనం విజయకుమార్‌రెడ్డి జిల్లా నాయకుడు కాకపోవచ్చుగాని నెల్లూరురూరల్ నియోజకవర్గ పరిధిలో గట్టి నాయకుడే! 2014ఎన్నికల్లో ఆనం కుటుంబం నుండి నలుగురు పోటీ చేశారు. ఎవరికీ ఓట్లు నాలుగు వేలకు మించలేదు. నెల్లూరురూరల్‌లో ఒక్క విజయకు మాత్రం 15వేలకుపైగా ఓట్లు వచ్చాయంటే అది కేవలం అతని వ్యక్తిగత ప్రభావమే! కాంగ్రెస్ మీద ప్రజలకు అంత కసి వున్న టైంలో కూడా ఆ పార్టీ అభ్యర్థిగా అతనికి ఆ మాత్రం ఓట్లు రావడం గొప్ప విషయమే! విజయకుమార్‌రెడ్డి చేరికవల్ల జిల్లా అంతా వైకాపాకు అదనపు బలం రాకపోవచ్చుగాని, నెల్లూరురూరల్‌లో ఇప్పటికే బలంగా వున్న పార్టీకి ఎక్స్‌ట్రా ఎనర్జీ కాగలదు.



### బైపాస్ బండి...

# ఆర్టీసీ రాబడికి గండి

ఆర్టీసీ ఎప్పటికప్పుడు నష్టాల్లోనే నడుస్తుంటోంది. అధికారుల నిర్ణయాలు కొన్ని ఈ నష్టాలకు కారణమని చెప్పవచ్చు. ప్రయాణీకులను త్వరితగతిన గమ్యస్థానాలకు చేర్చాలనే సంకల్పంతో తీసుకుంటున్న బైపాస్‌రైడర్, నాన్‌స్టాప్ సర్వీసుల నిర్ణయాలు ప్రైవేట్ ట్రావెల్స్ పట్ల వరంగా మారుతున్నాయి. ఈమధ్య నెల్లూరు–అల్లూరుల మధ్య నాన్‌స్టాప్ సర్వీసులను పెట్టారు. ఇవి అనవసరమైన సర్వీసులు. నెల్లూరుకు అల్లూరుకు మధ్య ప్రయాణం మహా అంటే గంటప్పావు, లేదా గంటన్నర. ఆర్డినరీకి నాన్‌స్టాప్‌కు మధ్య తేడా 15నిముషాలకు మించదు. ఈలోపు కొంపలంటుకుపోయే అవసరాలు ప్రయాణీకులకేమీ ఉండవు. అదీగాక అల్లూరు–నెల్లూరుల మధ్య మెయిన్‌రోడ్డులో నుండి కిలోమీటర్, రెండు కిలోమీటర్ల లోపలకు పోయే ఊర్లు కూడా ఏమీ లేవు. మెయిన్‌రోడ్డులోనే ఆయా గ్రామాల స్టాపింగ్‌లున్నాయి. కాబట్టి ప్రయాణీకులను ఎక్కించుకోవడం సులభం. ఇప్పుడు ఈ రూట్లో ఆర్టీసీ నాన్‌స్టాప్‌ల వల్ల మధ్యలోని గ్రామాల ప్రయాణీకులు ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితులొచ్చాయి.

జిల్లాలో ముఖ్యంగా ఆర్టీసీ ఆదాయానికి గండి కొడుతున్నది బైపాస్‌రైడర్లు. నెల్లూరు–తిరుపతి మధ్య ఎక్కువ సంఖ్యలో బైపాస్‌రైడర్లు నడుస్తున్నాయి. తిరుపతికి మూడుగంటల ప్రయాణం. బైపాస్‌రైడర్లు గూడూరు, శ్రీకాళహస్తి బస్టాండ్‌లలోకి పోవు కాబట్టి ఓ అరగంట ప్రయాణం కలిసొస్తుంది. అయితే గూడూరు, శ్రీకాళహస్తిలకు పోవాలనుకున్న ప్రయాణీకులకు బస్సులు రావడం లేదు. అలాగే నెల్లూరు–కడప, నెల్లూరు–బద్వేలులకు బైపాస్ సర్వీసులు నడుస్తున్నాయి. ఇవి మధ్యలో వున్న ఆత్మకూరులోకి పోవు. నెల్లూరు–చెన్నై మధ్య తిరిగే బైపాస్‌రైడర్లు గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేటలలోకి పోవు. బైపాస్‌రైడర్లు పూర్తి ఆక్యుపెన్సీతో నడిస్తే ఇబ్బంది లేదు. ఆ విధంగా నడిస్తే మంచి ఆదాయమే. కాని సగం బస్సు కూడా నిండదు. మధ్యలో గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేటకు వెళ్లే ప్రయాణీకులున్నా కూడా బస్సులో ఎక్కించుకోరు. ఒక్కోసారి ఖాళీ బస్సులే వెళ్తుంటాయి. ప్రయాణీకులున్నా కూడా బైపాస్‌రైడర్‌ల పేరుతో ఎక్కించుకోలేని పరిస్థితి. మరి ఇలాంటోళ్లంతా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

**పరిష్కారమేంటి..?:** బైపాస్‌రైడర్‌లను నడుపుతూనే మధ్యలో దిగే ప్రయాణీకులను ఎక్కించుకోవడానికి కూడా మార్గముంది. అదెలాగో చూద్దాం. నెల్లూరు–తిరుపతి మధ్య నడిచే నాన్‌స్టాప్ బస్సులో గూడూరు ప్రయాణీకులను కూడా ఎక్కించుకోండి. గూడూరుకు టిక్కెట్ కొట్టండి. వాళ్లను గూడూరు బైపాస్ వద్దే దించేయండి, బస్సు గూడూరు బస్టాండ్‌లోకి పోవాల్సిన పనిలేదు. గూడూరు బస్టాండ్‌లోకి వెళ్లే ఇతర బస్సులలో వారిని ఎక్కించుకునే విధంగా అవకాశం కల్పించాలి. గూడూరు బస్టాండ్‌లోకి ఎన్నో గ్రామాల నుండి బస్సులు వస్తుంటాయి. కాబట్టి ప్రయాణీకులు ఆ టిక్కెట్ మీద ఇంకో బస్సు ఎక్కి బస్టాండ్‌లో దిగే అవకాశం కల్పించాలి. శ్రీకాళహస్తికెళ్లే వారికైనా, ఆత్మకూరుకెళ్లే ప్రయాణీకులకైనా ఇంకే వూరికెళ్లే ప్రయాణీకులకైనా ఆర్టీసీ ఈ అవకాశం కల్పిస్తే బైపాస్ రైడర్‌ల మూలంగా కోల్పోతున్న ఆదాయాన్ని నిలబెట్టుకోవచ్చు.



# కమిషనర్‌ను కదిలించారు!

*నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్లుగా ఎవరొచ్చినా వారికి ఒక శాపం వర్తిస్తుంది. ఎవరు కూడా ఏడాదికంటే ఎక్కువ కాలం ఇక్కడుండకూడదనేది ఆ శాపం. గత కొన్నేళ్లుగా నెల్లూరు కార్పొరేషన్‌లో ఆ శాపం అమలులోనే వుంది. అయితే కొంతమందికి అనుమానం రావచ్చు... అలాంటి శాపమే వుంటే, గత కాంగ్రెస్ ప్రభుత్వంలో టిఎస్ఆర్ ఆంజనేయులు కమిషనర్‌గా అన్నేళ్లు ఎలా పనిచేయగలిగాడని. ఈ శాపం గురించి ముందుగానే తెలుసుకుని ఆయన శాప విమోచనానికి తాంత్రిక పూజలు చేయించుకుని వుండొచ్చు. తనకు శాపం వర్తించకుండా చేసుకుని ఉండొచ్చు.*

ఇదంతా వ్యంగ్యమే అయినా, నెల్లూరు కొచ్చిన కమిషనర్ల బదిలీలు చూస్తుంటే మాత్రం నెల్లూరు కార్పొరేషన్‌కు ఇలాంటి శాపమేదో ఉందనే అనుమానం రాక తప్పదు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే కాదు, ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం లోనూ అదేవిధంగా బదిలీలు జరుగుతున్నాయి. తెలుగుదేశం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలమే అయ్యింది. అర ఏడాదికి ఒకరు చొప్పున కమిషనర్ మారారు. నెల్లూరు నగరపాలక సంస్థకు ఐఎఎస్ ఆఫీసర్ కమిషనర్‌గా కావాలని వేయించుకున్న చక్రధర్‌బాబును కూడా ఇక్కడనుండి ఆరు నెలలకే పంపించారు. ప్రస్తుత కమిషనర్ పివివిఎస్ మూర్తిని కూడా బదిలీ చేశారు. ఆయన్ను ఆంధ్ర ప్రదేశ్ మున్సిపల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారిగా నియమించారు. మూర్తి అంటే మున్సిపల్ మంత్రి నారాయణతో పాటు మేయర్ అజీజ్‌కు కూడా పడడం లేదు. అందుకే మూర్తిని బదిలీ చేసి ఆయన స్థానంలో గుంటూరులో ఆర్.డిగా వున్న వెంకటేశ్వర్లును తీసుకొచ్చారు. ఎవరొచ్చినా ఇక్కడ ఆరునెలల సంబరమే! నెల్లూరులో కొలువు అంటే ఉద్యోగులంతా ఆనందపడే పరిస్థితి. కాని నెల్లూరు కమిషనర్‌గా రావాలంటే మాత్రం ఆందోళన చెందుతున్నారు.

## నెల్లూరు కబుర్లు

# గ్రేటర్ ఎన్నికల్లో నెల్లూరు నేతలు

ప్రతిష్టాత్మకంగా జరిగిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో జిల్లా తెలుగుదేశం నాయకులకు తలా ఒక ఏరియా బాధ్యతలు అప్పగించారు. జిల్లా నుండి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, కురుగొండ్ల రామకృష్ణ, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వాకాటి నారాయణరెడ్డిలతో పాటు పలువురు నాయకులు వారి వెంట వుండి నెల్లూరు జిల్లావాసులు అధికంగావున్న ఏరియాలలో ప్రచార బాధ్యతలు, ఎన్నికల పర్యవేక్షణ నిర్వహించారు. అయితే వీరి శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరే అనిపిస్తోంది.

# ఒకటో నగర సిఐగా కిషోర్‌బాబు

ఒకటో నగర సిఐగా కిషోర్‌బాబు 2వ తేదీ బాధ్యతలు చేపట్టారు. నెల్లూరులో ముస్లింలతో వచ్చిన వివాదంతో ఇక్కడ సిఐగా వున్న నరసింహారావును గుంటూరు రేంజ్ విఆర్‌కు బదిలీ చేశారు. రేంజ్ విఆర్‌లో వున్న కిషోర్‌బాబును ఒకటో నగరానికి బదిలీ చేశారు.

### యాదవ సంఘం రాజుగా

# సంపత్‌రాజు



అఖిలభారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా నెల్లూరుకు చెందిన తెలుగుదేశం నాయకుడు, సోమిరెడ్డి శిష్యుడు ఒట్టూరు సంపత్‌రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జనవరి 30వ తేదీన నెల్లూరులోని పరమేశ్వరి మహేశ్వరి కల్యాణ మండపంలో మహాసభ జిల్లా సమావేశం నిర్వహించారు. మహిళా విభాగానికి అధ్యక్షురాలిగా రావుల వెంకట జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా మేకల రజనీలను ఎన్నుకున్నారు.

# మళ్ళీ పంది దాడి

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని వెంకటేశ్వరపురంలో మనుషులపై పందులు పగబట్టినట్లున్నాయి. మమ్మల్ని నగరం నుండి లేకుండా చేయడం కాదు, మిమ్మల్ని మేం ఈ భూమ్మీద లేకుండా చేస్తాం అన్నట్లు అవి దాడికి దిగుతున్నాయి. గతంలో ఈ ప్రాంతంలోనే రెండు సందర్భాల్లో పిల్లలపై పందులు దాడి చేసి గాయపరచాయి. మొన్న ఆదివారం కూడా పెన్నా బ్రిడ్జి ప్రాంతంలో ఇంటి బయట వున్న మూడేళ్ల పిల్లాడిపై పంది దాడి చేసి గాయపరచింది. పిల్లోడిని ఆసుపత్రిలో చేర్చారు. వెంకటేశ్వరపురంలో పందుల పట్ల ప్రజలు జాగ్రత్తగా వుండాలి సుమా!

# 'తుని' ఘటనపై విచారణ

'తుని' రైల్వేస్టేషన్‌లో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ దహనం ఘటనపై ఇంటలిజన్స్ అధికారులు నెల్లూరులోనూ విచారణ జరిపారు. నెల్లూరుజిల్లా నుండి కాపు నాయకులు భారీఎత్తున కాపులను తీసుకెళ్లారు. 'తుని'కి వెళ్లినవారిలో నేరగ్రస్తులెవరైనా ఉన్నారా అనే దానిపై కూడా ఆరా తీశారు. అయితే జిల్లా నుండి అంతమాత్ర పోళ్లు ఎవరూ లేరని తెలుస్తోంది.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# 50కే లీటర్ కోకోనట్ వాటర్



అరలీటర్ లిమ్కా లేదా పెప్సీ వంటి కూల్‌డ్రింక్స్ బాటిల్స్ కొంటే 30రూపాయలు... లీటరు అరవై రూపాయలు. కూల్‌డ్రింగ్స్ తాగొద్దని జనవిజ్ఞాన వేదికోళ్లు, వైద్యులు మన చెవులకు మైకులు కట్టుకుని చెబుతున్నారు. అయినా మనం వింటామా... రిలయన్స్‌మాల్‌లో చూస్తే కూల్‌డ్రింక్స్ బాటిల్స్‌ను కేసులకు కేసులు తీసుకుపోతుంటారు. ఇవి తాగితే మన ఆరోగ్యం పాడవుతుంది. ఇప్పుడు కూల్‌డ్రింక్స్‌కు ఖర్చు... భవిష్యత్‌లో వీటి మూలంగా వచ్చే రోగాలకు కూడా ఖర్చు. పైగా మన డబ్బంతా కూడా విదేశాలకు పోతోంది. కూల్‌డ్రింక్స్ తాగితే మనకు జబ్బు... విదేశీ కంపెనీలకు డబ్బు.

అదే కొబ్బరినీళ్లు తాగితే ఆరోగ్యానికి ఆరోగ్యం... మన డబ్బు మన దేశంలోనే వుంటుంది. మన కొబ్బరి రైతులు బాగుపడతారు. రైతుల వద్ద కొబ్బరిబోండాలు కొనుక్కుని బజారులో అమ్ముకునేవాళ్లు కూడా నాలుగు రూపాయలు సంపాదించుకుంటారు. నగరంలో అక్కడక్కడా చూస్తున్నాం. ఆటోలలో కొబ్బరిబోండాలు పెట్టుకుని లీటర్ బాటిల్ 50రూపాయలకే అమ్ముతున్నారు. మార్కెట్‌లో లీటర్ నీళ్లనే పాతికరూపాయలకు అమ్ముతున్నారు. లీటర్ కొబ్బరినీళ్లు కావాలంటే కనీసం ఆరేడుకాయలు పడతాయి. మన రైతుల కష్టాన్ని మనం క్యాష్ చేయాలంటే కూల్‌డ్రింక్స్ మానాలి... కొబ్బరినీళ్లు అలవాటు చేసుకోవాలి.

# అమ్మవారి హుండీ ఆదాయం 16.50 లక్షలు

నెల్లూరు నగరంలోని దర్గామిట్టలో వున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానానికి వచ్చే భక్తుల సంఖ్య ఇటీవల గణనీయంగా పెరుగుతోంది. ఆలయంలో అమ్మవారికి ఏ విశిష్ట పూజలు, సేవలు జరిగినా భక్తజనం క్రిక్కిరిసిపోతున్నారు. కోరిన కోర్కెలు నెరవేర్చే తల్లిగా అమ్మవారు ప్రసిద్ధి. దీంతో, భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్నారు. దీంతో అమ్మవారి హుండీ ఆదాయం కూడా పెరుగుతూనే వుంది. గత నెల 30న ఆలయంలోని హుండీ లెక్కింపు జరపగా, అక్టోబర్ 23 నుంచి జనవరి 30వ తేది వరకు సుమారు ఈ మూడు నెలల కాలంలోనే అక్షరాలా పదహారు లక్షలా యాభైవేలా ఏడువందల అరవై రూపాయలు వచ్చినట్లు ఆలయవర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్ర దేవాదాయశాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి పర్యవేక్షణలో ఈ హుండీ లెక్కింపు జరిగింది.

# ఇబ్బంది పడ్డ నెల్లూరోళ్లు

జనవరి 31వ తేదీన తునిలో నిర్వహించిన కాపు గర్జన సదస్సుకు నెల్లూరు నుండి కాపు కులస్థులు భారీ సంఖ్యలోనే వెళ్లారు. జిల్లాలో నెల్లూరు, కావలి డివిజన్‌ల నుండి ఎక్కువగా వెళ్ళారు. తునిలో సదస్సు అనంతరం ఒక్కసారిగా ఉద్రిక్తతలు తలెత్తిన నేపథ్యంలో నెల్లూరోళ్లు తిరిగి నెల్లూరు రావడానికి ఇబ్బందులు పడ్డారు.

# పిఆర్‌టియు నూతన కార్యవర్గం

ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం నెల్లూరు టెక్కేమిట్టలోని ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా వల్లూరు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌విఎస్ శర్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్.నాగేంద్రశర్మ అధ్యక్షత వహించారు.

### క్యాన్సర్ ఆసుపత్రికి

# కావల్‌రెడ్డి కుటుంబ విరాళం



నెల్లూరు, పొదలకూరురోడ్డులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి కీర్తిశేషులు కావల్‌రెడ్డి సుశీలమ్మ జ్ఞాపకార్ధం వారి భర్త కావల్‌రెడ్డి దశరథ రామిరెడ్డి, కుమారులు, కోడళ్ల శ్రీనాథ్‌రెడ్డి – ప్రమిద, రవీంద్రరెడ్డి – శోభారాణి మరియు వారి కుటుంబ సభ్యులైన కరేటి దామోదర్‌రెడ్డిలు 10లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఆసుపత్రి తొలి విరాళ దాత జె.యస్.రెడ్డి సమక్షంలో ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.లక్ష్మికి ఈ విరాళం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ గీతాఉషశ్రీలు కూడా పాల్గొన్నారు.

# ఏ.వి.యస్‌కే రెడ్‌క్రాస్ పీఠం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి నూతనంగా ఎన్నికైన పదిమంది సభ్యుల్లో ఛైర్మెన్, వైస్‌ఛైర్మెన్, ట్రెజరర్‌లను గత నెల 30న ఎన్నికల అధికారి డి.రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఆయన అధ్యక్షతన పదిమంది పాలకసభ్యులు సమావేశమై వారిని ఎన్నుకున్నారు. ఛైర్మెన్‌గా అన్నదాత వెంకట సుబ్రహ్మణ్యం, వైస్ ఛైర్మెన్‌గా లింగారెడ్డి వెంకటనరసారెడ్డి, ట్రెజరర్‌గా మోహన్‌లాల్ జైన్‌లను ఎన్నుకున్నారు. మిగతా ఏడుగురు సభ్యులుగా వుంటారని ఎన్నికల అధికారి రాజేశ్వరరావు పేర్కొన్నారు.

# వ్యాసరచనలో రత్నం చిన్నారుల ప్రతిభ

శ్రీరామచంద్రమిషన్ వారి ఆధ్వర్యంలో ఇటీవల అఖిలభారత స్థాయిలో జరిగిన వ్యాసరచన పోటీ–2015లో కేటగిరి–1లో నెల్లూరులోని డైకస్‌రోడ్డులో వున్న రత్నం మోడల్ స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను కనపర్చి మంచి స్థానాలు దక్కించుకున్నారు. తెలుగులో జరిగిన వ్యాసరచనలో ఈ స్కూల్‌కు చెందిన జి.పూజిత ప్రథమ స్థానం సాధించగా, ఎస్‌కె ఆసిఫా ద్వితీయ స్థానాన్ని, ఇంగ్లీష్‌లో జరిగిన వ్యాసరచన పోటీల్లో ఎస్‌కె సుష్మ, కె. విశ్వలేఖ ద్వితీయస్థానాలను సాధించారు. వీరిని పాఠశాల డైరెక్టర్‌లు కృష్ణకిశోర్, వాసంతి కిశోర్‌లు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ప్రిన్సిపాల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అపోలోలో అవగాహన సదస్సు



నెల్లూరు అపోలో స్పెషాలిటి ఆసుపత్రిలో న్యూరాలజీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డా॥ బిందు మీనన్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మెడికల్ సూపరింటెండెంట్ డా॥ శ్వేతారెడ్డి, ఆపరేషన్స్ యూనిట్ హెడ్ వి.నవీన్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సదస్సులో ఉపాధ్యాయులకు బ్రెయిన్‌స్ట్రోక్(మెదడు పక్షవాతము), ఎపిలెప్సీ(మతిమరపు) గురించి వివరించారు. ఈ సందర్భంగా డా॥ బిందుమీనన్ మాట్లాడుతూ జబ్బు రాకుండా నియంత్రించడం ఎంతో ముఖ్యమని "డ్యాష్" డైట్ థెరపీ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ నేతాజీ పైలట్ హై స్కూల్ కరస్పాండెంట్ యం.వి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదిమందికి మంచి చేయాలన్న ఆశయానికి, సమాజానికి మనవంతు సేవలందించాలన్న సంకల్పానికి వయసు కొలమానం కాదు. మనకు చేతనైనంత మంచి చేయాలనే మంచి మనసు ఉండడమే ప్రధానం. మనిషి ఒక్కడే నవ్వుకుంటే పిచ్చంటారు, పదిమందితో కలిసి నవ్వితే ఆరోగ్యం... పదిమందిని నవ్విస్తూ ఆ నవ్వులను చూసి తానూ సంతోషిస్తుంటే అది సమాజహితం. నేను ఈ సమాజానికి ఏం చేయగలను అనేకంటే కూడా ఏదో ఒకటి చేయగలను అని ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే... మనవల్ల కొండంత కాకపోయినా కొంతన్నా ఈ సమాజానికి మేలు జరుగుతోంది.

## యువ చైతన్య దీప్తి...

# పరిమళించే సేవాస్ఫూర్తి






ఈ సమాజానికి నేను ఏదో ఒకటి చేయాలన్న సంకల్పంతో ముందుకొచ్చిన ఒకటో నెంబర్ కుర్రాడే మాగుంట శరత్‌చంద్రారెడ్డి. 30ఏళ్ల వయసు... యూత్‌తో ఎంజాయ్ చేయాల్సి ప్రాయంలో ఉన్నాడు. అయితే అసలైన ఎంజాయ్‌మెంట్ బార్లలోని బీర్లలో, పబ్‌లలోని డ్యాన్సుల్లో కాదని, అనాథాశ్రమాలలోని వృద్ధుల ఆప్యాయత, అనాథ చిన్నారుల కళ్లల్లో కనిపించే ఆనందంలో వుందని గ్రహించిన యువకుడు. తానే కాదు, తన స్నేహితులను కూడా సమాజ సేవా కార్యక్రమాలలో భాగస్వామ్యులను చేసి పదిమంది ఆనందించేలా పని చేయడమే అసలైన ఎంజాయ్‌మెంట్ అని నిరూపిస్తున్నాడు. అణువణువు సేవాస్ఫూర్తిని నింపుకున్న ఆ యువకుడే మాగుంట శరత్‌చంద్రారెడ్డి. దివంగత మాగుంట సుబ్బరామన్న కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన ప్రముఖ కాంట్రాక్టర్ మాగుంట వెంకటనారాయణరెడ్డి కుమారుడు.

మాగుంట శరత్‌చంద్రారెడ్డి మిత్రులు కొంతమంది కలిసి కొంత కాలం క్రితమే నెల్లూరు నగరంలో తమవంతు సేవలందించాలన్న లక్ష్యంతో మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవాసమితిని స్థాపించారు. వీళ్లు కోట్లు ఖర్చుపెట్టి భారీ సేవా కార్యక్రమాలు చేయకున్నా సమయం, సందర్భాన్ని బట్టి తమకు సాధ్యమైన రీతిలో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తూ అందరి మన్ననలందుకుంటున్నారు.

ప్రభుత్వ బడుల్లో చదివి పదో తరగతిలో మంచి మార్కులు తెచ్చుకున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతులతో సత్కరించారు. నెల్లూరులో ప్రతిష్టాత్మకంగా జరిగే రంగడి తిరునాల, రొట్టెల పండుగలలో వచ్చిన భక్తులకు మజ్జిగ, మంచినీళ్లు వంటివి అందించారు. ఎంతో టెన్షన్‌గా ఎంసెట్ వ్రాయడానికొచ్చిన విద్యార్థులకు ఆహారం, మంచినీళ్లు అందించి ఉపశమనం కల్పించారు. అనాథాశ్రమాలలో, హాస్టళ్లల్లో, మున్సిపల్ స్కూళ్లలో క్రిస్మస్, నూతన సంవత్సరం, దీపావళి, సంక్రాంతి వేడుకలను నిర్వహించడం, అక్కడి వారిలో ఆనందం నింపడం చేశారు. జాతీయ దినాలలోనూ సందర్భోచితంగా ఈ సేవాసమితి సభ్యులు తమ సేవా కార్యక్రమాలను చేపడుతుండడం స్ఫూర్తిదాయకం. ఆహారభద్రతా దినోత్సవం రోజున పేదల ఆకలి తీర్చడం, పర్యాటక దినోత్సవం రోజున మొక్కలు నాటడం వంటివి వీరి సామాజిక బాధ్యతకు నిదర్శనం. ఇక మొన్న సంక్రాంతికి మాగుంట శరత్‌చంద్రారెడ్డి స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నెల్లూరు విఆర్‌సి మైదానంలో నిర్వహించిన క్రీడాపోటీలు జిల్లా వాసుల ప్రశంసలందుకున్నాయి. పోటీలలో కబడ్డీ, ఖోఖో వంటి గ్రామీణ క్రీడలకు పెద్దపీట వేసి వీరు పోటీలు నిర్వహించిన తీరు ఎంతైనా అభినందనీయం.

సేవా ప్రపంచం మానవప్రపంచం కంటే పెద్దది. సేవకు ఆరంభం తప్ప అంతం ఉండదు. సమాజసేవలో మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి ఇప్పుడే బుడిబుడి అడుగులు వేస్తోంది. త్వరలోనే పరుగులు తీసే స్థాయికి ఎదగాలని ఆశిద్దాం. వాళ్లు చేసే సేవా కార్యక్రమాల విలువ ఎంతనేదానికంటే, వారిలోని సేవాస్ఫూర్తిని ఎన్ని కోట్లతోనూ వెలకట్టలేం. ప్రతి ఒక్కరూ అభినందించాల్సింది ఆడుతూపాడుతూ బైక్‌లలో, ఫ్రెండ్స్‌తో ఖుషీగా తిరగాల్సిన వయసులో వారు అనుసరిస్తున్న సేవామార్గాన్ని, ఆచరణలో చూపిస్తున్న ఆదర్శభావాల్ని.

హేట్సాఫ్ యం.యస్.ఆర్.టీమ్.

## జయజయధ్వానాల మధ్య

# జగన్నాథ రథయాత్ర



- సింహపురిలో మార్మోగిన భగవన్నామ స్మరణ
- భక్తజనులతో క్రిక్కిరిసిన పురవీధులు

'హరే రామ!.. హరే కృష్ణ!..కృష్ణ కృష్ణ హరే హరే!'..అంటూ పెద్దపెట్టున చేస్తున్న ఆ జగన్నాథుని దివ్య నామ స్మరణల మధ్య, మంగళవాయిద్యాల మధ్య.. విశేషంగా తరలివచ్చిన భక్త జనుల జయజయధ్వానాల మధ్య సింహపురి పట్టణంలో గతనెల 30వ తేదీన ఎంతో వైభవంగా జగన్నాథుని రథయాత్ర జరిగింది. నెల్లూరు ఇస్కాన్ మందిరం వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో అనేకమంది స్వామీజీలు, నగర ప్రముఖులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని జగన్నాథుని దివ్యరథాన్ని ముందుకు నడిపించారు. రథయాత్ర పొడవునా ఆ దేవదేవుని కీర్తిస్తూ భజనలు, మహిళలు-చిన్నారుల కోలాటాలు, బ్యాండ్ మేళాలు, బాణాసంచావేడుకలతో నగరవీధులు మార్మోగాయి. అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం ఆవిర్భవించి యాభైఏళ్ళు పూర్తయిన సందర్భంగా, నెల్లూరులో 5వ జగన్నాథ రథయాత్రను ఎంతో వైభవంగా నిర్వహించారు. ఇస్కాన్ అంతర్జాతీయ ప్రతినిధులైన శ్రీ భానుస్వామి, రామగోవిందప్రభు, సత్యగోపీనాథ్‌ప్రభు, లోకేష్‌చైతన్య ప్రభు, శంక దారి దాస్‌లతో కలసి, నెల్లూరు ఇస్కాన్ మందిర అధ్యక్షుడు సుకదేవిస్వామి తదితరులంతా శోభాయమానంగా తీర్చిదిద్దిన జగన్నాథుని రథం వద్ద పూజలు చేశారు. భక్తజనులు పెద్దపెట్టున భగవన్నామస్మరణ చేస్తుండగా శ్రీ సుకదేవస్వామి రథయాత్రను ప్రారంభించారు. నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్‌పేట సత్రం బడి వద్ద నుంచి ప్రారంభమైన ఈ రథయాత్ర, ఆత్మకూరు బస్టాండ్, విజయమహల్ గేట్, ఆర్‌ఆర్ వీధి, గాంధీబొమ్మ, విఆర్‌సి సెంటర్, ఆర్టీసి బస్టాండ్‌ల మీదుగా కస్తూరిదేవి గార్డెన్స్‌కు చేరుకుంది. రథం తమ వీధుల్లోకి వస్తుందనగానే పురవీధుల్లోని ప్రజలు రోడ్లపై నీళు ముగ్గులు వేసి, జగన్నాథస్వామికి భక్తిశ్రద్ధలతో కొబ్బరికాయలు, పుష్పాలు సమర్పించారు. రథయాత్రను భక్తితో స్వాగతిస్తూ కుటుంబసభ్యులందరితో కలసి స్వామివారిని దర్శించుకున్నారు. జగన్నాథుడు కొలువైవున్న రథాన్ని ముందుకు నడిపించేందుకు భక్తులంతా పోటీపడి రథాన్ని లాగారు. రథయాత్రను పురస్కరించుకుని పలువురు చిన్నారులు దేవతామూర్తుల వేషధారణలతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ రథయాత్రలో వివిధ దేశాలకు చెందిన ఇస్కాన్ మందిరాల నిర్వాహకులతోపాటు, డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, యాలమూరి రంగయ్యనాయుడు, స్థానిక ప్రముఖులు వీరిశెట్టి హజరత్‌బాబు, నలుబోలు బలరామయ్యనాయుడు, జివి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# షిర్డిషా హోండాలో న్యూమోడల్స్

నేటి యువత హుందాతనానికి ధీటుగా కొత్తబైక్‌లు ఉన్నాయని నెల్లూరుజిల్లా ఉపరవాణా కమిషనర్ శ్రీరామ్‌ప్రసాద్ అన్నారు. ఆదివారం ఈ నూతన బైక్‌లను నెల్లూరు కెవిఆర్ పెట్రోల్ బంకు వద్దనున్న శ్రీ షిర్డీషా హోండా షోరూంలో ఆయన ఆవిష్కరించారు. షోరూం ఎండి కొండా బలరామిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొండా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ హోండా హర్నాట్ 160ఆర్, హోండా సిబి షైన్ ఎస్‌పి 125బైక్‌లు అత్యాధునిక సాంకేతికతతో రూపుదిద్దుకున్నాయని, యువతను వినూత్నంగా ఆకట్టుకుంటాయన్నారు. వినియోగదారులు ఆదరించాలని కోరారు. షోరూం మేనేజర్ రవి బైక్‌ల విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ పార్టనర్ కె.మోహిని, తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల సేవలో తరించండి


- ఇరుకళలమ్మ ఆలయ కొత్త కమిటీకి ఆదాల హితబోధ



నెల్లూరు గ్రామ దేవత మూలాపేటలో వేంచేసియున్న శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి సభ్యులుగా ఎన్నికైనవారు దేవస్థానంలో భక్తులకు అసౌకర్యం లేకుండా పర్యవేక్షణ వుండాలని, దేవస్థానం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి, మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ఆదివారం దేవస్థానంలో నూతన పాలక మండలి సభ్యులకు అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆదాల మాట్లాడుతూ రాబోయే రెండు, మూడు నెలల్లో జిల్లాలోని అన్ని దేవస్థానాలకు పాలకమండళ్ల ఏర్పాటును పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వం నుండి దేవస్థానాల అభివృద్ధికి నిధుల కేటాయింపుకు కృషి చేస్తామన్నారు. ధర్మకర్తల మండలి అధ్యక్షుడు మెట్టు సురేష్‌బాబు మాట్లాడుతూ కమిటీ సభ్యుల సహకారంతో దేవస్థానం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కమిటి అధ్యక్షులు మెట్టు సురేష్‌బాబు, సభ్యులు అలిమేలి శ్రీహరి ఆచారి, పూల బాలసుబ్రహ్మణ్యం, ఉచ్చూరు సురేష్, ఒట్టూరు సుధాకర్, రావూరు కృష్ణసుధ, పంట్రంగి వెంకటేశ్వర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు పులికొలను చంద్రశేఖర్ ఆచారిలను ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఇఓ శ్రీనివాసులురెడ్డి, టిడిపి నాయకులు వై.వి. రామిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి, దేవస్థానం మాజీఛైర్మెన్లు సూరిశెట్టి నరేంద్ర, ఇందుకూరు రమేష్‌కుమార్ ఆచారి, కార్పొరేటర్లు శైలజ, రాజా నాయుడు, రూప్‌కుమార్, పేట మాధవయ్య ఆచారి తదితరులు పాల్గొన్నారు.

# 56 ఏళ్ళ కాళిదాస కళానికేతన్





పాట పాడుతున్న సుగంధిని

గూడూరు డిఎన్ఆర్ కమ్యూనిటి హాలులో శ్రీ కాళిదాస కళానికేతన్ 56వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రెండురోజుల పాటు నిర్వహించిన పాటల పోటీలు ఆదివారం రాత్రితో ముగిసాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రధానోత్సవానికి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, దర్శకుడు పి.చంద్రశేఖరరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగిస్తూ కళాకారుల్లో దాగున్న ప్రతిభను వెలికితీసి వారికి తగిన ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సంస్థ నిర్వహించిన పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన ఎందరో ప్రతిభ కలిగిన కళాకారులు నేడు సినీ రంగంలో ఉన్నతస్థాయిలో ఉన్నారన్నారు. ప్రముఖ నేపథ్యగాయకుడు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం ఇక్కడ వేదిక నుంచే వెళ్లారని గుర్తు చేశారు. ఇంకా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి చేవూరు విజయమోహన్‌రెడ్డి, రచయిత్రి శివజ్యోతి, రచయిత జానకీ రామారావు, కె.మునిగిరీష్, కె.ఎస్.రెడ్డి, మనపాటి రవీంద్ర, కాళిదాస కళానికేతన్ అధ్యక్షుడు షేక్ గౌస్‌బాషా తదితరులు మాట్లాడారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. సంస్థ కార్యదర్శి ప్రభాకర్‌రావు, జాన్ ప్రభాకర్, సులేఖ తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా శంకరరావు వ్యవహరించారు.

# వినియోగదారులకు చేరువగా బిఎస్ఎన్ఎల్

**- డిఇ కృష్ణమూర్తి**



ప్రజలకు అందుబాటులో బిఎస్ఎన్ఎల్ ఉందని గూడూరు డి.ఇ వాని కృష్ణమూర్తి 'లాయర్'కు తెలిపారు. 67వ రిపబ్లిక్‌డే సందర్భంగా రూ.670లు మొబైల్ రీఛార్జ్ చేసుకుంటే అదనంగా రూ.67లు వస్తుందన్నారు. బ్రాడ్‌బాండ్ ఇంటర్నెట్ నిలిపి వేసిన వారికి కొన్ని రాయితీలతో కనెక్షన్ తీసుకోవచ్చన్నారు. ఇన్‌స్టాలేషన్ ఛార్జీలు, ఒక నెల ఫిక్స్‌డ్ ఛార్జీలు కట్టవలసిన అవసరం లేదన్నారు. 500 ఆన్‌నెట్ ఫ్రీకాల్స్ ఒక నెల ఇస్తారన్నారు. ల్యాండ్ లైన్ డిస్కనెక్ట్ అయిన వారికి రీకనెక్షన్ మేళా ఈ నెల 8వ తేదీ నుండి 28వ తేదీ వరకు జరుగుతుందని, వాయిదా పద్దతిలో డబ్బులు చెల్లించి తిరిగి వారి ఫోన్‌ను పొందవచ్చునన్నారు. చిల్లకూరులో బిఎస్ఎన్ఎల్ టవర్ పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. సిమ్‌కార్డు రేట్లు తగ్గిస్తున్నట్లు, జనరల్ మేనేజర్ టెలికాం నెల్లూరు ఎమ్ఎస్ఎ నూటన్ ఆదేశాల మేరకు గూడూరు డివిజన్‌లో బిఎస్ఎన్ఎల్ సేవలు ప్రజలకు అందిస్తున్నట్లు గూడూరు టెలికాం డిఇ వానా కృష్ణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో టెలికాం ఎస్‌డిఇ టి.మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# ఫుట్‌ఓవర్ బ్రిడ్జి లేక ప్రయాణీకుల అవస్థలు



మూసివేసిన శిథిలావస్థలో వున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి

గూడూరు దక్షిణాన వున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి శిథిలావస్థలో వుందని గత 4 నెలలుగా మూసివేశారు. దీంతో ప్రయాణీకులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రెండో ఫ్లాట్‌ఫాం కాని, మూడవ ఫ్లాట్‌ఫాం కాని వెళ్లాలంటే ఉత్తరం సైడు చివరన కొత్తగా కట్టిన బ్రిడ్జి దాకా పోయి దాటవలసి వస్తోంది. ఇది ప్రయాణీకులకు చాలా దూరమైనందున పెద్దలు, పిల్లలు, స్త్రీలు రైల్వేట్రాక్ దాటి అవతల ఫ్లాట్‌ఫాంకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీనివల్ల చాలా ప్రమాదాలు జరిగే అవకాశాలు వున్నాయి. స్టేషన్‌లో రైళ్లు అన్ని ఎక్కువగా దక్షిణం వైపు ఆగుతున్నందున ప్రయాణీకులకు ఎక్కువగా దక్షిణ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి అవసరం ఎంతైనా వుంది. ఉత్తరాన కొత్తగా కట్టిన బ్రిడ్జి నిరుపయోగంగా ఉందని ప్రయాణీకులు వాపోతున్నారు.

దక్షిణంవైపు మాలవ్యానగర్, వీరారెడ్డిపల్లి, జానకిరాంపేట, సొసైటీ, రాణిపేట, తిలక్‌నగర్‌లో ఉండే ప్రజలకు సౌకర్యంగా ఉంది. సంబంధిత రైల్వే అధికారులు స్పందించి చర్యలు తీసుకుని దక్షిణాన వున్న శిథిలావస్థలో వున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని పునరుద్ధరించాలని, లేనిపక్షంలో అదేచోట మరో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని రైల్వే ప్రయాణీకులు కోరుతున్నారు.

# కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు



సమావేశంలో మాట్లాడుతున్న డిఇఓ ఆంజనేయులు



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

చదువుతోనే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి ఆంజనేయులు, సబ్‌కలెక్టర్ గిరీషా అన్నారు. ఆదివారం గూడూరు మండల పరిధిలోని శారదానగర్‌లోని ఎల్‌పిపి పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకోవాలన్నారు. వాటిని సాధించేందుకు కష్టపడాలన్నారు. తల్లిదండ్రులు సైతం ప్రోత్సాహాన్ని అందించాలన్నారు. పాఠశాలలో విద్యార్థులను చదువులతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాలపై రాణించేలా ప్రోత్సాహాన్ని అందించాలన్నారు.

అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. పాఠశాల ఛైర్మెన్ బి.సుబ్రహ్మణ్యంరెడ్డి, కరస్పాండెంట్ బి.శ్రీకాంత్‌రెడ్డి, ఓం నమఃశివాయ, కె.మునిగిరీష్, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి

గూడూరు పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు తీర్మానించారు. స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో ఇటీవల ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ప్రశాంతంగా జరిగింది. పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా ఉందని, కుక్కలు, పందుల బెడద అధికంగా ఉందని వైసిపి కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్‌తో వాగ్వివాదానికి దిగారు. సిబ్బంది, అధికారులు సైతం పారిశుద్ధ్యం మెరుగు పరచడంలో అశ్రద్ధ వహిస్తున్నారని, తమకు ఎలాంటి సమాచారం అందించడం లేదని ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన మాట్లాడుతూ పారిశుద్ధ్యం విషయంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ పూర్తి స్థాయిలో పని చేయాలన్నారు. పది ఫాగింగ్‌మిషన్‌ల ద్వారా పట్టణంలో దోమల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం అజెండాలోని పలు అంశాలను చర్చించి ఆమోదించారు. వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, శ్రీనివాసులు, రమేష్, వాటంబేడు శివకుమార్, నాశిన నాగులు, ఎంబేటి చంద్రయ్య, దండు మహేష్‌రెడ్డి తదితరులు మాట్లాడారు.

# కవులు సమాజ మార్గదర్శకులు

**- ప్రముఖ సినీ రచయిత వెన్నెలకంటి**



కవులు, రచయితలు సమాజ మార్గదర్శకులని ప్రముఖ సినీ రచయిత వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. నెల్లూరు పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు టౌన్‌హాలు వర్ధమాన సమాజంలో కీ.శే. పంచాగ్నుల విశ్వేశ్వరశర్మ ప్రథమ వర్ధంతి పురస్కరించుకుని సాహిత్య సేవా పురస్కారాలు-2016 ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పంచాగ్నుల విశ్వేశ్వరశర్మ మన మధ్య లేకపోయినా ఆయన భావాలు, రచనలు అనుభూతులు కలిగిస్తాయన్నారు. మురళీకృష్ణ గ్రూప్ ఆఫ్ హోటల్స్ యం.డి వీరిశెట్టి హజరత్‌బాబు మాట్లాడుతూ అందరూ పంచాగ్నుల విశ్వేశ్వరశర్మను ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన చేసిన సేవల్ని కొనియాడారు. అనంతరం అభ్యుదయ రచయిత సేవాపురస్కారాన్ని రాచపాళెం రఘుకు, పర్యావరణ ప్రేమికుడు పురస్కారాన్ని శ్రీ శారదా సాహిత్య పీఠం వ్యవస్థాపకుడు బి.సీతారామశాస్త్రికి ముఖ్యఅతిథులు అందజేసి శాలువాలు, పూలమాలలు, కిరీటం సన్మానపత్రంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బి.సోమయ్య, ఆచార్య ఆదిత్య, నలుబోలు బలరామయ్యనాయుడు, వొమ్మిన నాగ సతీష్, బి.వి.నరసింహం, అంది శ్రీనివాసులు, రచయితలు వల్లకవి వెంకట సుబ్బారావు, దశరథరామిరెడ్డి, ఇసనాక దయాకర్‌రెడ్డి, జి.సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు పర్యవేక్షించారు.

# చిన్నతనం నుండే సన్మార్గంలో నడవండి

**- డిఎస్పీ శ్రీనివాస్**




ర్యాలీలో మాట్లాడుతున్న డిఎస్పీ బి.శ్రీనివాస్

చిన్ననాటి నుంచే పిల్లలు సన్మార్గంలో నడవకపోతే భవిష్యత్తులో సమస్యలు ఉత్పన్నమవుతాయని డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ తెలిపారు. గూడూరు పట్టణంలో ఐసిడిఎస్ ఆధ్వర్యాన ఇటీవల విద్యార్థులతో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం డిఎస్పీ మాట్లాడుతూ అనాథపిల్లలు, వీధిబాలలను గుర్తిస్తే, ఆ సమాచారాన్ని పోలీసులకు గాని, పిల్లల సంరక్షణ అధికారులకు గాని తెలియజేయాలని సూచించారు. పిల్లలు సత్ప్రవర్తనతో పెరిగితే మంచి సమాజ స్థాపన సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ సుబ్బారావు, ఎస్సై దశరథ రామారావు, సిబ్బంది సమత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు నేతలతో రియాల్టీషో

గల్పిక

ఐఆర్20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమల ఉత్పత్తికి హెడ్‌క్వార్టర్ అయిన నెల్లూరు నగరం. ఏ.సి. సెంటర్‌లోని 'చింపిరి జింపిరి హేర్ స్టైల్' షాపు. స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానంద రెడ్డి(65) ఓ కుర్చీలో కూర్చుని 'సింహా' మీసానికి ట్రిమ్మింగ్ చేయించుకుంటున్నాడు. ట్రిమ్మింగ్ చేస్తున్న బార్బర్ టీవీలో వస్తున్న ఇండియా-ఆస్ట్రేలియా మూడో టీ20 మ్యాచ్‌ను ఓ పక్క టెన్షన్‌తో చూస్తూ ఇంకో పక్క బ్లేడ్‌తో వివేకా మీసాన్ని తీర్చిదిద్దేపనిలో ఉన్నాడు. బార్బర్‌తో వివేకా... రేయ్, మీసం షేప్ సరిగ్గా రావాలి, బాలకృష్ణను మించిపోవాలి, ఈ మీసం మీద నిమ్మకాయలు కాదు జామకాయలు నిలబెట్టాలి. జాగ్రత్తగా చెయ్ అని చెప్పాడు. ఓ పక్క మ్యాచ్ చూస్తేనే బార్బర్... మీకెందుకు సార్ టెన్షన్... మీ మీసం సంగతి నాకొదిలేయండి అని చెప్పాడు. మ్యాచ్ క్లైమాక్స్‌కొచ్చింది. చివరి ఓవర్... ఆ ఓవర్‌లో 17 పరుగులు కొడితే భారత్ విన్. యువరాజ్ బ్యాటింగ్... బార్బర్‌తో పాటు వివేకా కూడా టెన్షన్‌గా టీవీ వైపు చూడసాగాడు. మొదటి బంతికి ఫోర్, రెండో బంతికి సిక్సర్... బార్బర్ ఓ పక్క మీసం పని చేస్తూనే, టీవీ చూస్తూ టెన్షన్‌తో కేకలు పెడుతున్నాడు. చివరి బంతికి రెండు పరుగులు రావాలి... బంతి పడింది, సురేష్ రైనా ఫోర్ కొట్టాడు... 'ఫినిష్' అంటూ బార్బర్‌తో పాటు వివేకా కూడా అరిచాడు... బార్బర్ 'ఫినిష్' అన్న సమయంలోనే మ్యాచ్‌తో పాటు ఇక్కడ ఇంకొకటి కూడా ఫినిష్ అయ్యింది. మ్యాచ్ మేనియా నుండి బయట పడ్డాక బార్బర్ వివేకా ముఖంవైపు చూసాడు... అంతే అతని పై ప్రాణాలు పైనే పోయాయి. మీసం ఎంత అందంగా వుందో చూద్దామని వివేకా అద్దం వైపు తిరిగాడు. అతనికి అద్దంలో ఏమీ కనిపించలేదు. ఇక్కడ అద్దం లేదేందిరా అని వివేకా అడిగాడు. బార్బర్‌కు విషయం అర్థమై వణుకుతున్న చేతులతో వివేకా కళ్లకున్న పసుపు రంగు అద్దాలను తీసి పక్కనపెట్టాడు. ఈసారి వివేకాకు అద్దంలో తన ముఖం స్పష్టంగా కనిపించింది... కాకపోతే మూతి మీద మీసం లేదు. అది చూడగానే వివేకా.. కెవ్... కెవ్... అంటూ డిటిహెచ్ లెవల్లో కేకపెట్టాడు. ఆ కేకలు పెడుతూనే కళ్లు తెరిచాడు. ఆయన కేకలకు కాపువీధిలోని చుట్టుపక్కల ఇళ్లల్లోని వాళ్లంతా పరుగులు తీసారు. కొందరు కేకలు వచ్చిన వివేకా బెడ్‌రూంలోకి వచ్చారు. వివేకా బెడ్ మీద కూర్చుని బిత్తరచూపులు చూస్తూ నా మీసం నా మీసం... అంటూ ఏడుస్తున్నాడు. పి.ఏ రాజు వచ్చి ఆయన ముఖం ముందు అద్దం పెట్టి... మీ 'సింహా' మీసం ఎక్కడికీ పోలేదు సార్, ఇదిగో చూసుకోండి అని చూపెట్టాడు. తన మీసం చూసుకున్నాక గాని వివేకా మనసు కుదుటపడలేదు. 'బార్బర్‌షాపు' సీనంతా ఒక కల అని తెలుసుకోవడానికి ఆయనకు అరగంట పట్టింది.

అప్పుడే నలుగురు యువకులు వివేకాను కలవడానికి వచ్చారు. తాము 'జింగిడి' టీవీ ఛానెల్ నుండి వస్తున్నామని, ఒక రియాల్టీ షో తీస్తున్నామని, ఇందులో మీకు ప్రధానపాత్ర ఉంటుందని, బెస్ట్ పెర్ఫార్మెన్స్‌కు 4కోట్లు ప్రైజ్‌మనీ ఉంటుందని చెప్పారు. సబ్జెక్ట్ ఏంటని వివేకా అడిగాడు. ప్రస్తుత రాష్ట్ర, జిల్లా రాజకీయ పరిస్థితులపైనేనని వారిలో వున్న డైరక్టర్ యలమందయ్య చెప్పాడు. ఈ రియాల్టీషోలో ఇంకా ఎవరెవరు నటిస్తున్నారని వివేకా అడిగాడు. ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు వంటి వాళ్లు నటిస్తున్నారని డైరెక్టర్ చెప్పాడు. పిల్లకాకులు, నా యాక్షన్ ముందు వీళ్లెంత, ఖచ్చితంగా ఆ ప్రైజ్ మనీ నాదే అని వివేకా ఫిక్సయ్యాడు.

★★★★★

'జింగిడి' టీవీ టీమ్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్ వద్దకు కూడా పోయి రియాల్టీ షో గురించి వివరించి... ఎవరు ఎంత తీవ్రంగా విమర్శలు చేస్తే వాళ్లకు అంత మార్కులు పడతాయని చెప్పారు. దాంతో శ్రీధర్‌రెడ్డి, అనిల్ కూడా ఎలాగైనా తమ టాలెంట్ చూపి ప్రైజ్‌మనీ గెలుచుకుని, గవర్నమెంట్ ఎలాగూ ఫండ్స్ ఇవ్వడం లేదు కాబట్టి ఈ ఫండ్స్‌తోనైనా తమ నియోజకవర్గాలలో నాలుగు పనులు చేయాలనుకున్నారు.

★★★★★

అది నెల్లూరులోని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కార్యాలయం. కోటంరెడ్డి, అనిల్ ప్రెస్‌మీట్ పెట్టారు. రియాల్టీషో తీసే వాళ్లు విలేకర్ల మాదిరిగా వస్తారని అంతకుముందే డైరెక్టర్ చెప్పి వుండడంతో వీళ్లు ఆ దృష్టితో ప్రెస్‌మీట్ పెట్టారు. అంతకుముందు వివేకా జగన్‌ను 420అని తిట్టున్నాడు. దాని మీద వీళ్లిద్దరూ చెలరేగిపోయారు. 420×10ని కలిపితే ఒక వివేకా... తొడగొట్టి చెబుతున్నా... బస్తీమే సవాల్... ఎక్కడ తేల్చుకుందామో చెప్పు... నీ సెంటర్ కొస్తా, నీ వీధికొస్తా, నీ ఇంట్లోకి వస్తా... ఫేస్ టు ఫేస్... కమాన్ టు ఫైట్... అని కోటంరెడ్డి సవాల్ విసిరితే... అనిల్ వుండి... ప్లేస్ నువ్వు చెప్పినా సరే, నన్ను చెప్పమన్నా సరే... టైం నువ్వు చెప్పినా సరే నన్ను చెప్పమన్నా సరే... ఎనీ టైం ఎనీ సెంటర్... సింగిల్ హ్యాండ్... అని ఆవేశంగా అరిచాడు.


★★★★★

ఏ.సి సెంటర్‌లోని నగర కాంగ్రెస్... సారీ... ఆనం వారి తెలుగుదేశం కార్యాలయం. వివేకా ప్రెస్‌మీట్... వివేకా కళ్లు ఎదురుగా వున్న మీడియా ప్రతినిధులవైపు తీక్షణంగా చూస్తున్నాయి. రియాల్టీ షో తీసే కెమెరా ఎవరి వద్ద ఉందా అని ఆయన కళ్లు వెదుకుతున్నాయి... తర్వాత ప్రెస్‌మీట్ మొదలు పెడుతూ... ఆరోజు పేపర్ చేతిలోకి తీసుకున్నాడు. వెంటనే పేపర్‌ను విసిరేసి "అమ్మో ఫేస్ టు ఫేసా" నాకు భయమేస్తుంది బాబూ... ఏంది ఇంత భయంకరంగా బెదిరిస్తున్నారు. నాకు ఫ్యాంట్ తడిచిపోతుంది నాయనో.. అని అటూ ఇటూ కొద్దిసేపు వూగి తర్వాత స్టడీ అయ్యి... ఉడత బెదిరింపులకు ఈ 'సింహా'ం బెదరదు. పులిలా పెరిగాను, వేటాడ్డం నాకు బిర్యానీతో పెట్టిన విద్య. ఒక్కొక్కరిని చీల్చి చెండాడుతా... ఒంటి మీదకు 65ఏళ్లొచ్చాయి కదా వీడేం పీకుతాడనుకుంటున్నారేమో... నా ఇంట్లోనే కాదు, నా ఒంట్లోను నా కంట్లోనూ పవరే... నన్ను ఒక వైపే చూడండి... రెండో వైపు కూడా కావాలంటే చూడండి... మూడో వైపు చూడాలను కోవద్దు... తట్టుకోలేరు... మాడి మసైపోతారు... అంటూ కాలితో గట్టిగా క్రింద టైల్స్‌ను తన్నాడు. ఒక టైల్ విరిగి ముక్కలు గాల్లోకి ఎగిరాయి. అక్కడితో ప్రెస్‌మీట్ అయిపోయింది. అందరూ వెళ్లాక వివేకా 'జింగిడి' టీవీ డైరెక్టర్‌కు ఫోన్ చేసి... ఈరోజు పెర్ఫార్మెన్స్ అదరగొట్టాను... నాకే ఎక్కువ మార్కులు రావాలి అని చెప్పాడు.

★★★★★

అది ముదురుదోమల మంత్రి, నైట్‌రైడర్ నారాయణ కార్యాలయం. మంత్రితో పాటు సోమిరెడ్డి, ఆదాల, రమేష్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ వంటి నాయకులున్నారు. ఎన్‌డిఎన్ ఛానల్‌లో మొదట కోటంరెడ్డి, అనిల్‌ల ప్రెస్‌మీట్, ఆ తర్వాత వివేకా కౌంటర్ ప్రెస్‌మీట్‌లు వచ్చాయి. అప్పుడే జింగిడి టీవీ టీమ్‌గా చెపుతున్న నలుగురు యువకులు అక్కడకు వచ్చి నారాయణతో... సార్, మీరు చెప్పినట్లే వీళ్లని రియాల్టీషో అనే బుట్టలో వేసాం... అందుకే ఒకర్నొకరు ఎలా తిట్టుకుంటున్నారో చూడండి అని అన్నారు. ఇదంతా మీ వల్లనేనా అని సోమిరెడ్డి, ఆదాలలు ఆశ్చర్యంగా నారాయణను అడిగారు. దానికి అతను... అవును, నా ప్లానే! ఆ కోటంరెడ్డి, అనిల్‌లు ఉసిక్కిమంటే నామీదకొస్తున్నారు. వాళ్లకు నేనెక్కడ సరిపోతాను, అందుకే రియాల్టీషో మ్యాజిక్‌తో వివేకాను తగిలించాను. ఇక వాళ్లు వాళ్లు చూసుకుంటారు, నేను ప్రశాంతంగా ఉండొచ్చన్నాడు. అది విని సోమిరెడ్డి, ఆదాలలు... అమ్మ, నారాయణా మమ్మల్నే మించిపోయావే అని అనుకుంటూ నోర్లు తెరిచారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

కుటుంబసభ్యులకు స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. ప్రయాణాలు జరుగుతాయి. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగి ఆదాయం పెరుగుతుంది. ఇంటా బయటా వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. కుటుంబ సౌఖ్యముంటుంది. విద్యాప్రగతి బాగుంటుంది. వాహనాలు జాగ్రత్తగా నడపండి. షేర్లు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగులకు పనివత్తిడి ఉంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

అవసరాలకు మూలధనం తీయడం, లేక చేబదుళ్ళు తీసుకొనడం జరుగవచ్చును. దూరప్రయాణాలుంటాయి. కుటుంబ అవసరాలు, ప్రయాణ ఖర్చులు బాగుంటాయి. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. ఆరోగ్యం సరిగా ఉండక ఇబ్బంది పెడుతుంది. వస్తు వాహన రిపేర్లుండవచ్చును. కోర్టు కేసులు వాయిదా పడతాయి. విద్యాప్రగతి బాగుంటుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్థ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

యజమానులకు వర్కర్లతో సమస్యలుంటాయి. బిడ్డల విద్య, ఉద్యోగావకాశాలు మెరుగుగా ఉంటాయి. శుభ కార్యాలు నిర్ణయం కాగలవు. కొత్త గృహోపకరణాలు, విలువైన వస్తువులు సమకూర్చుకొంటారు. ప్రభుత్వ అనుమతులందు ఆలస్యం, రావలసిన బాకీలు వాయిదా పడటం జరుగుతుంది. అల్పులతో తగాదాలుంటాయి. విద్యావృద్ధి బాగుంటుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

కొత్త వస్తువులు, విలువైన వస్తువులు చేకూర్చుకొంటారు. అనుకున్న ప్రయత్నాలకు అనుకూలత బాగుంటుంది. కొత్త వ్యాపారవృద్ధి అవకాశాలు, అగ్రిమెంట్లు కలిసివస్తాయి. ఆదాయం పెరుగుతుంది. సేవా దైవ కార్యాలలో ప్రముఖంగా వ్యవహరిస్తారు. ఉద్యోగులకు కార్యసామర్థ్యం, గుర్తింపు గౌరవాలుంటాయి. వ్యవహారాలలో సర్దుబాటు ధోరణి అవసరం.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆర్థికస్థితి బాగుండి ఆదాయం బాగుంటుంది. క్రీడా శాస్త్ర సాంకేతిక రంగాల వారికి అవకాశాలుండగలవు. రావలసిన బాకీలు కొంతవరకు అందుతాయి. కోర్టు కేసులలో అనుకూలత, కుటుంబసభ్యులతో చిన్న విభేదాలుంటాయి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. వృత్తి వ్యాపారాలందు బాగా కృషి చేస్తారు. ఆరోగ్యం బాగుండి ఆర్థికావకాశాలు పెరుగుతాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలలో అవకాశాలు బాగుండి ఆదాయం బాగుండును. కొత్త పెట్టుబడులు, వ్యాపార విస్తరణ బాగుండి ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. తొందరపాటు వ్యవహారాలు తగ్గించుకొని అనుకున్న పనులను సమయానుకూలంగా జరుపుకొనండి. తొందరపాటు తగ్గించుకుని ఆలోచనలతో పనులు చేయండి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి – మీ వాసి

తేది. 5.02.2016 నుండి
తేది. 11.02.2016 వరకు

ఈ వారం సింహంలో గురు రాహువు, తులలో కుజుడు, వృశ్చికంలో శని, ధనుస్సులో శుక్రబుధులు, 8తేది నుండి మకరంలో బుధుడు, మకరంలో రవి, కుంభంలో కేతువు, ధనుర్మకర కుంభ మీన రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**
ముహూర్తములు లేవు.

**పుష్య మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 5 | శుక్ర | ద్వాదశి | రా॥ గం.11.13వ॥ |
| తేది. 6 | శని | త్రయోదశి | రా॥ గం.11.01వ॥ |
| తేది. 7 | ఆది | చతుర్దశి | రా॥ గం.10.16వ॥ |
| తేది. 8 | సోమ | అమావాస్య | రా॥ గం.9.07వ॥ |

**మాఘ మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 9 | మంగళ | పాడ్యమి | రా॥ గం.7.33వ॥ |
| తేది. 10 | బుధ | విదియ | సా॥ గం.5.42వ॥ |
| తేది. 11 | గురు | తదియ | సా॥ గం.3.36వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కోర్టు వ్యవహారాలలో అనుకూలత, ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. సోదర వర్గానికి మేలు జరుగుతుంది. వ్యాపారవర్గాలకు అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. పెండింగ్‌లో పనులు మరల కొనసాగుతాయి. రావలసిన బాకీలు కొంత లభించగలవు. విద్యార్థులకు తమ పనిలో ప్రగతి కలదు. కుటుంబ సభ్యుల అభీష్టాలను గమనించుకొని పోవడం మంచిది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. స్థిరాస్తుల లావాదేవీలను వాయిదా వేసికొనండి. ఆర్థికంగా బాగుండినా అవసరాలకు ఋణం చేయవలసిరావచ్చును. ఏ వ్యవహారంలోనైనా ఆత్మీయులను సంప్రదించి నిర్ణయాలు తీసికొనండి. ఇతరులకు సహాయపడతారు. కుటుంబానికి అనుకోని స్వల్ప ఆదాయం ఉంటుంది. అనుకున్న పనులు జరిగిపోతాయి. ఆత్మీయులను కలుసుకొంటారు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

అదనపు ఖర్చులు ఏదో ఒక రూపంలో పెట్టక తప్పదు. దూరప్రాంతాల నుండి ఆహ్వానాలు, ప్రయాణాలుంటాయి. చెల్లింపులు సకాలంలో జరుపుతారు. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా ఉంటాయి. వృత్తి వ్యాపారాల పెరుగుదల, రాబడి అభివృద్ధి చెందుతుంది. కొత్త పెట్టుబడులకు అవకాశాలుంటాయి. ఆరోగ్యం విషయంలో మీరు జాగ్రత్త వహించాలి.


## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

కొత్త వ్యాపారులకు, కాంట్రాక్టర్లకు ప్రయత్నాలు జరుగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు ఆశాజనకంగా ఉంటాయి. ఉద్యోగులకు పనిభారంతో పాటు గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆశించినంత వృద్ధి ఉండదు. ఆదాయం సామాన్యం. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. అనుకున్న పనులు వాయిదా పడవచ్చును.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

అనుకున్న పనులు టెన్షన్ పెట్టినా సక్రమంగా జరుగుతాయి. దైవ, సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. కుటుంబంలో స్వల్ప విభేదాలు చోటు చేసికొనవచ్చును. స్థిరాస్తుల లావాదేవీలు, నూతన గృహోపకరణాలు కొనడం జరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు దొరికి ఆదాయం పెరుగుతుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు వత్తిడులుండవచ్చును. వృత్తి వ్యాపారాలలో ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. ఆర్థికంగా బాగుండినా అవసరాలకు ఋణం చేయవలసి వస్తుంది. అదనపు ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి. చేయుచున్న పనులకు ఆటంకాలవల్ల టెన్షన్ పడుతుంటారు. శుభ వార్త వింటారు. షేర్లపై ఆదాయముంటుంది.

# శుభమస్తు రక్తదాన శిబిరం



నెల్లూరు చిన్నబజారులో నాణ్యమైన పట్టువస్త్రాలకు నమ్మకమైన చిరునామాగా నిలిచిన న్యూ రాజ్యలక్ష్మి హాల్ బట్టల అంగడి వ్యవస్థాపకులు బయ్యా వెంకట రమణయ్య ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని శుభమస్తు షాపింగ్‌మాల్ నందు శుభమస్తు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3వతేదీ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శుభమస్తు అధినేతలు బయ్యా వాసు, బయ్యా రవిల ఆధ్వర్యంలో వారి సంస్థలకు చెందిన 100మంది సిబ్బంది రక్త దానం చేశారు. రెడ్‌క్రాస్ నెల్లూరుశాఖ ఛైర్మెన్ డాక్టర్ ఏ.వి.సుబ్రహ్మణ్యం, బ్లడ్ మోటి వేటర్స్ బయ్యా ప్రసాద్, భాస్కర్‌నాయుడులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బయ్యా వాసు, బయ్యా రవిలు తమ తండ్రి జ్ఞాపకార్ధంగా వెయ్యి మందికి గుండెపోటు వచ్చినప్పుడు అత్యవసరంగా వాడాల్సిన మందులను ఉచితంగా అందజేశారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీ త్యాగరాజస్వామి ఆరాధన



నెల్లూరు వేదాయపాళెంలోని త్యాగరాజనగర్‌లో వున్న శ్రీ సద్గురు త్యాగరాజస్వామి ఆలయంలో ఇటీవల స్వామివారి ఆరాధనా మహోత్సవం ఎంతో భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో ఈ ఆరాధనలో పాల్గొని స్వామివారిని దర్శించుకు న్నారు. ఈ సందర్భంగా వేదాయపాళెంలో శ్రీ త్యాగరాజస్వామివారి భక్తబృందం భిక్షాటనతో నగర సంకీర్తన నిర్వహించారు. ఆ తర్వాత ఔత్సాహిక సంగీత కళాకారులు శ్రీ త్యాగరాజస్వామి కృతులను వీనులవిందుగా గానం చేశారు. స్థానిక సంగీత విద్వాంసులు శ్రీ త్యాగరాజస్వామి పంచరత్న కీర్తనలను ఎంతో హృద్యంగా ఆలపించారు. ఈ సంగీతోత్సవంలో ప్రముఖ సంగీత కళాకారులు డివి సురేష్‌రావు, జెవిఎస్‌ఆర్‌ఎస్ ప్రసాద్, బి.మాదేశ్వరప్రసాద్, జె.బాలార్క, ఏ. లక్ష్మీప్రసన్న, ఏ. రమాదేవి, పి.దేవసేన, వనజలత పాల్గొనగా, ఎం.లోకేష్, షణ్ముఖ, వేదవ్యాస్, వనజ (వయోలిన్), శాంతి కళాధర్, హరిప్రసాద్, శివకుమార్ (మృదంగం), సుబ్రహ్మణ్యం(కంజీరా)లు సహవాయి ద్యాలతో సహకరించారు. ఆ తర్వాత, ప్రఖ్యాత వేదపండితులు శ్రీ మాచవోలు రాజశేఖరశాస్త్రిగారిచే శ్రీ త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవం ఆద్యంతం కన్నుల పండువగా జరిగింది. శ్రీ త్యాగరాజస్వామి సేవాసమితి నిర్వాహకులు వై.నాగదేవి ప్రసాద్, డి.రామచంద్రమూర్తి, ఏ.రామప్రసాద్, మల్లికార్జునరావు, పి.బలరామ్, ఏవి ప్రసాద్, ఏ. రాధాకృష్ణమూర్తి, చతుర్వేదుల రామచంద్రమూర్తి, హనుమంతురావు తదితరులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# మైథిలి స్కూల్ క్రీడోత్సవం




ఈ నెల 3వ తేదీన నెల్లూరులోని ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియంలో మైథిలి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆటల పోటీలను మున్సిపల్ శాఖ మంత్రి ఓఎస్‌డి సి.పెంచలరెడ్డి ప్రారంభించారు. ఈ నెల 14వ తేదీన పాఠశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్కూలు యాజమాన్యం ఈ క్రీడాపోటీలను నిర్వహించింది. పాతికేళ్లుగా స్కూల్‌ను మంచి ప్రమాణాలతో నడుపుతూ ఎంతో మంది విద్యార్థులకు ఉజ్వలభవిష్యత్‌నందించిన మైథిలి స్కూల్ యాజమాన్యాన్ని ఓఎస్‌డి పెంచలరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో మెప్మా పిడి సోమయ్య, అపస్మా ఉపాధ్యక్షుడు ఎం.వి.సుబ్బారెడ్డి కూడా పాల్గొన్నారు. స్కూల్ కరస్పాండెంట్ మైథిలి మనోహర్‌రెడ్డి ఈ క్రీడోత్సవాలను పర్యవేక్షించారు.

# అధికారపక్షం ఆమోదించినా సమావేశం కొనసాగింపు

- ఇన్‌ఛార్జి ఛైర్మెన్ తీరును తప్పుపట్టిన అధికారపక్ష కౌన్సిలర్లు
- అధికారులను సైతం వదలని వైఎస్సార్సీపి కౌన్సిలర్లు



## కావలి కబుర్లు

కావలి పురపాలక సంఘం సమా వేశంలో అధికారపక్షం కౌన్సిలర్లు అజెం డాలోని అంశాలను ఆమోదించామని సమావేశ మందిరం నుంచి వెళ్లిపోయినా వైఎస్సార్సీపి కౌన్సిలర్లతో మునిసిపల్ ఇన్‌ఛార్జి ఛైర్మెన్ గుండ్లపల్లి భరత్‌కుమార్ సమావేశాన్ని కొనసాగించారు. ఈ నెల 2న కావలి పట్టణంలోని వార్డులలో అభివృద్ధిపనుల నిమిత్తం సమావేశం నిర్వ హించారు. సమావేశం ప్రారంభం నుంచి అధికారపార్టీ కౌన్సిలర్లు వ్యూహాత్మకంగా తమ వార్డుల్లో అభివృద్ధిపనులకు ఆమోదం తెలిపి వెళ్లిపోయారు. ఇన్‌ఛార్జి ఛైర్మెన్ కలుగజేసుకుని అజెండాలోని అంశాలను చదవకుండా ఆమోదించడం ఏమిటని, సమావేశాన్ని మిగిలిన సభ్యులతో కొన సాగించిన తీరును అధికారపార్టీ కౌన్సిలర్లు తప్పుపట్టారు. ఇదే అదనుగా వైఎస్సార్సీపి కౌన్సిలర్లు మునిసిపల్ కమిషనర్‌పై, అధికారులపై విమర్శనాస్త్రాలు సంధిం చడంతో మనస్థాపం చెందిన అధికారులు కూడా సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. ఈ పరిణామాల మధ్య ఇన్‌ఛార్జి ఛైర్మెన్ చేసేదేమీ లేక సవరణ లతో కూడిన అంశాలను అన్నింటినీ ఆమోదించామన్నారు.

***కించపరచడం సరి కాదు: ఇన్‌ఛార్జి ఛైర్మెన్***

కౌన్సిల్ సమావేశంలో తనను కించ పరిచేవిధంగా మాట్లాడడం సరైనది కాదని ఇన్‌ఛార్జి ఛైర్మెన్ గుండ్లపల్లి భరత్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశం అనం తరం ఆయన తన ఛాంబర్‌లో మాట్లా డుతూ, కౌన్సిలర్లు ఎవరైనా అసభ్యకరంగా మాట్లాడితే తన దృష్టికి తీసుకురావాలే తప్ప, సమావేశం జరుగుతుండగా కమి షనర్, అధికారులు సమావేశాన్ని బహిష్క రించి వెళ్ళిపోవడం సరికాదన్నారు. కాగా, ఈ సందర్భంగా ఆయన ఛాంబర్‌లో వైఎస్సార్సీపి సభ్యులతో కలిసి మాట్లాడడం చర్చనీయాంశంగా మారింది.

# ఎస్సీఎస్టీల భూములను పరిరక్షించాలి



దగదర్తి మండలంలోని కొరుగుంట, లయన్స్ నగర్, ఉలవపాళ్ల ప్రాంతాల్లో విమానాశ్రయం ఏర్పాటుకు చేసిన సర్వేలో దళిత, గిరిజనుల భూములున్నట్లు తెలుస్తోందని, వాటిని ధారాదత్తం చేస్తే సహించేది లేదని, దళితుల, గిరిజనుల భూములను పరిరక్షించాలని కోరుతూ దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి అన్నారు. ఇటీవల ఆయన దళితులతో కలసి పట్టణంలో ధర్నాందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిజమైన లబ్దిదారులకే ప్రభుత్వం పరిహారం అందించాలన్నారు. దళితులకు, గిరిజనులకు, వెనుకబడిన వర్గాల వారికి ప్రభుత్వం డి-ఫారమ్ పట్టాలు అందజేసిందని, 1978లో సుమారు 150 ఎకరాల భూమిలిస్తే ప్రస్తుతం ఆ లబ్దిదారుల పేర్లు మార్పులు చేర్పులు చేసి వున్నారని అన్నారు. ఆ మేరకు వారు ఆర్‌డిఓ లక్ష్మీనరసింహంకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దళితనాయకులు డివి రమణయ్య, వెంకటేశ్వర్లు, విజయరత్నం, పరదేశి, లక్ష్మీనర్సు, బాబు, భాస్కర్, రవీంద్రబాబు, జయ కుమార్, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలను ప్రోత్సహించాలి



సమాజంలో ప్రతి ఒక్కరూ సామాజిక సేవల పట్ల అవగాహన కలిగి వుండాలని, సామాజిక సేవలను అందరూ ప్రోత్సహించాలని కావలి విశ్వ శాంతి విద్యాసంస్థల కరెస్పాండెంట్ డివి రమణయ్య అన్నారు. సోమవారం స్థానిక ఆ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో, వికలాంగుల సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు టి.సి మాల్యాద్రినాయుడిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వికలాంగులకు, వృద్ధులకు తమ సేవాసంఘం ద్వారా విశేష సేవలందించినందుకు గాను జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకోవడం అభినంద నీయమన్నారు. మాల్యాద్రినాయుడు తన సేవలను మరెందరికో అందించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశ్వశాంతి పాఠశాల ఉపాధ్యా యులు, సేవాసంఘం సభ్యులు పాల్గొన్నారు.

# నగరాభివృద్ధే అజెండాగా మారాలి

**- డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్**



రాజకీయ జెండాలను పక్కనపెట్టి అందరూ నెల్లూరు నగరా భివృద్ధే అజెండాగా, అదే అందరి ధ్యేయంగా కృషి చేయాలని నెల్లూరు డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నగరాభివృద్ధికి రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ సహకరించాలన్నారు. అధికార పార్టీ నేతల మాటలు వినడం లేదనే సాకుతో ఇప్పటికి ముగ్గురు కమిషనర్లను బదిలీ చేశారని, అయితే వారిని బదిలీ చేసినంత మాత్రాన ఒరిగే ప్రయోజనమేమున్నదని ఆయన అంటూ, ఇప్పుడు వచ్చిన కమిషనర్నయినా పూర్తికాలం కొనసాగించి నగరాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సంద ర్భంగా వైఎస్సార్సీపి ఫ్లోర్ లీడర్ రూప్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ, అధికారులు ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం లేకపోవడంతో కార్పొరేషన్ పాలన అధ్వాన్నంగా వుందని ఆయన బాధను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాస యాదవ్, లేబూరు పరమేశ్వరరెడ్డి, ఓబిలి రవిచంద్ర, ఊటుకూరు మాధవయ్య, గోగుల నాగరాజు, దేవరకొండ అశోక్‌తో పాటు నాయకులు వేలూరు మహేష్, వి.రంగ, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ కాలుష్యంపై శిక్షణా శిబిరం

నెల్లూరు పొదలకూరురోడ్డులోని డిఎస్ఎస్ఎస్ హాలులో పర్యావరణ కాలుష్యంపై ఆదివారం శిక్షణా శిబిరం జరిగింది. కన్స్యూమర్‌గైట్స్ సొసైటి, విజయవాడ వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణా శిబిరంలో ముఖ్యఅతిథిగా సామంతు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సొసైటి అధ్యక్షులు చెన్నుపాటి దివాకర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు అవసరమన్నారు. పర్యావరణ కాలుష్య విశ్లేషకులు కుట్టియప్పన్ పర్యావరణ కాలుష్యం వల్ల ప్రజలకు కలిగే ఇబ్బందులను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిటిజన్ కన్స్యూమర్ అండ్ సివిక్ యాక్షన్ గ్రూప్ డైరెక్టర్ విష్ణు, రైట్ టు ఇన్ఫర్మేషన్ అండ్ కన్స్యూమర్స్ ప్రొటెక్షన్ ఫరమ్ ప్రధాన కార్యదర్శి ఎ.జయప్రకాష్, స్వచ్ఛంద సంస్థల అధ్యక్షుడు వివియన్ నాయుడు పాల్గొన్నారు.

# ఇవేం నోర్లు... ఇవేం మాటలు

(మొదటి పేజీ తరువాయి)

ఆనం వివేకానందరెడ్డి ఎప్పుడైతే తెలుగుదేశంలో చేరాడో, అప్పటినుండే నెల్లూరు నగరంలో రాజకీయ సెగలు మొదలయ్యాయి. వివేకా పక్కా రాజకీయ నాయకుడు. ఈయనకు కొత్తగా ఎవరూ గుడ్డలూడదీయాల్సిన పని లేదు. ఎందుకంటే గుడ్డలిప్పుకుని ముందుగానే ఆయన రోడ్డు మీద నిలబడి ఉంటాడు. అవతల వాళ్లను కూడా గెలికి గొడవ పెట్టుకోవడం ఈయన స్కూల్ రోజుల్లోనే నేర్చుకున్న విద్య. వివేకా తెలుగుదేశంలోకి వచ్చాక నగర రాజకీయం ఏ స్థాయిలో వేడిపుట్టిస్తుందో చూడండి... ***మిస్టర్ 420... లత్‌కోర్... కుర్రకుంక... ముసలి నక్క... దాల్ దకార్... అలబరోళ్ల సంఘం అధ్యక్షుడు... రాజకీయ సంకరజాతి వ్యక్తి... పిచ్చికుక్కను తిరిమినట్లు... రాజకీయ అఘోరా... ఉన్మాది... నరమాంసం మరిగిన పులులు... ఫేస్ టు ఫేస్ తేల్చుకుందాం... వెధవకూతలు... కారుకూతలు... ముదురుకుంక...*** వినడానికి ఎంత వినసొంపుగా ఉన్నాయి ఈ మాటలు, విని కూడా ఎంత కాలమైందో... అప్పు డెప్పుడో ఆనమోళ్లకు సోమిరెడ్డికి మధ్య, ఆదాలకు సోమిరెడ్డికి మధ్య విమర్శల యుద్ధం జరిగినప్పుడు ఈ స్థాయి కాకున్నా, ఒక రకమైన మాటలు విన్నాం. ఇప్పుడు ఆనం వివేకా – కోటంరెడ్డి, అనిల్‌ల మధ్య జరుగుతున్న వార్‌లో ఈ మాటలను విన్నాం. ఒకరు మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తయితే మిగిలిన ఇద్దరూ ప్రస్తుత ఎమ్మెల్యేలు. ఒకరినొకరు ఏ మాత్రం తగ్గకుండా భాషాప్రయోగం జరుపుతున్నారు. తిట్ల పురాణంలో తమ టాలెంట్‌ను చూపించుకున్నారు. తెలుగుదేశంలోకి వచ్చాక తానేంటో తన నోటి పవరేంటో చూపించాలి కాబట్టి ఆనం వివేకా ప్రెస్‌మీట్ పెట్టి జగన్‌ను 420అని తిట్టాడు. జగన్‌ను తిడితే కోటంరెడ్డి, అనిల్‌లు స్పందిస్తారని వివేకాకు తెలుసు. ఆయనకు కావాల్సింది కూడా అదే! ఎందుకంటే వైకాపాలో యాక్టివ్‌గా వుండేది, చంద్రబాబు మీద గాని, జిల్లా మంత్రి నారాయణ మీద గాని విమర్శలతో చెలరేగేది వీళ్లిద్దరే! వీళ్లిద్దరి మీద ప్రతి దాడి చేస్తే జిల్లా తెలుగుదేశం పార్టీలో వివేకానే లీడ్ తీసుకున్నట్లవుతుంది. జిల్లాలో వైకాపా నేతలను గట్టిగా ఎదుర్కొనేది వివేకా ఒక్కడేనన్న పేరొస్తుంది. అందుకే వివేకా ముందు జగన్‌ను తిట్టాడు. దాంతో కోటంరెడ్డి, అనిల్‌లు తీవ్రంగా స్పందించడంతో తన వ్యూహం ఫలించిందనుకుని వారి మీద పడ్డాడు వివేకా. వీళ్లు కూడా వివేకాను గతంలో ఏ నాయకుడూ విమర్శించని... దీనికంటే తిట్టని రీతిలో తిట్టారు. కోటంరెడ్డి, అనిల్‌లు అనే మాటలను వివేకా గాని, వివేకా అనే మాటలను వీళ్లు గాని పెద్దగా పట్టించుకోరు. ఎందుకంటే వాళ్లు పక్కా రాజకీయనాయకులు. అబ్బా... ఏందిరా వీళ్లు ఇలా తిట్టుకుంటున్నారని నోరెళ్లబెట్టి చూసే జనమే అమాయకులు.

పొలిటికల్‌గా జిల్లాలో ఎవరి లీడ్ వాళ్లు తీసుకున్నారు. జిల్లా తెలుగుదేశంలో చంద్రబాబు, నారాయణల మీద మాట పడనివ్వని నాయకుడిగా వివేకా పొజిషన్ తీసేసుకుంటే, జగన్ మీద ఈగ వాలినా ఒప్పుకోమనే లీడర్లుగా కోటంరెడ్డి, అనిల్‌లు గుర్తించబడ్డారు ఓన్లీ ఈ ఎపిసోడ్ ద్వారా!

# పవర్ తగ్గిన స్టార్

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతుంటే వచ్చి ప్రశ్నిస్తానని పవన్ అప్పుడే చెప్పాడు. రాజధాని పేరుతో రైతుల భూములు లాక్కున్నా, సెజ్‌ల పేరుతో భూముల దోపిడీకి పాల్పడుతున్నా, ఇరిగేషన్ పనులతో దోచుకుతింటున్నా, ఇసుక దోపిడీతో కోట్లు కొల్లగొడుతున్నా, అధికారులను వేధింపులకు గురి చేస్తున్నా, ఋణమాఫీని అమలు చేయకున్నా, సంక్షేమ పథకాలకు నిలువునా పాతరేసినా... పవన్ ఏరోజూ ప్రశ్నించలేదు. రాజధాని భూముల విషయంలో కూడా రెండ్రోజులు తిరిగి ప్రభుత్వానికే తలవంచి పోయాడు.

'తుని'లో సంఘటన జరగ్గానే కేరళలో షూటింగ్‌లో వున్న పవన్ అదరాబదరా హైదరాబాద్ వచ్చాడు. పవన్ వస్తున్నాడంటే పెద్దసంచలనమే వుంటుందని, ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టిస్తాడని అందరూ ఊహించారు. అయితే హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టిన పవన్ అటు విధ్వంసకాండకు పాల్పడ్డ కాపు నాయకులను ఇలా ఎందుకు చేసారనిగాని, ఎన్నికల్లో కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తామన్న చంద్రబాబును ఆ హామీ ఎందుకు అమలు చేయడం లేదని గాని ప్రశ్నించలేదు. నేను ఒక కులం కోసం పార్టీని పెట్టలేదని చెప్పాడు. అభినందించదగ్గ పాయింటే! అయితే ఈ సంఘటన పై అటు విధ్వంసకారులనో, ఇటు ప్రభుత్వాన్నో ఉతికి ఆరేసుండాలి. అదేంకాకుండా ఎవరినీ ప్రశ్నించకుండా అటు ఇటుగా మాట్లాడి, అసలు తానెందుకు కేరళ నుండి షూటింగ్ మానుకుని వచ్చాడనే దానికి అర్థం లేకుండా చేశాడు. ఇంతటి తొక్కలో మీటింగ్‌కు కేరళ నుండి రావాలా అంటూ అప్పడే ఆయనపై సెటైర్లు మొదలయ్యాయి.

పవన్ ఒక కులం తరపున పోరాటం చేయక్కర్లేదు, ఒక కులం తరపున ప్రశ్నించనవసరం లేదు. రాష్ట్ర ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. ప్రజాసమస్యలపైన ప్రభుత్వాన్ని నిలదీసి కడుగుతుంటే పవర్‌స్టార్‌లో వున్న తన పవర్‌ను కాపాడుకోగలడు. లేకపోతే హీరో కాస్తా కమెడియన్ అయిపోతాడు.

# అవసరానికనుగుణంగా ధాన్యం కేంద్రాలు

**- జాయింట్ కలెక్టర్ ఎ.ఎం.డి.ఇంతియాజ్**



రైతులు పండించిన ధాన్యాన్ని సేకరించేందుకు అవసరమైన ధాన్య కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎ.ఎం.డి.ఇంతియాజ్ పేర్కొన్నారు.

బుధవారం గ్రీవెన్స్ హాల్లో ధాన్యం సేకరణ మరియు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై రైస్‌మిల్లర్లు, రైతు నాయకులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతులు పండించిన వరిధాన్యం దిగుమతులకనుగుణంగా రైతులు కోరిన ప్రదేశాలలో ధాన్య కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియలో పౌరసరఫరాలు, వ్యవసాయ మార్కెటింగ్ మరియు వ్యవసాయశాఖ అధికారుల సమన్వయంతో పటిష్టమైన చర్యలు తీసుకొని రైతులకు అందుబాటులో వుండే విధంగా కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కేంద్రాల వద్దకు తీసుకెళ్లేందుకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అలాగే అవసరమైన గోనెసంచులు, తూకాల మిషన్లను తదితర పరికరాలను సిద్ధంగా వుంచాలన్నారు. రైతులు మరియు రైస్ మిల్లర్లు ఆర్థికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పటిష్టంగా అమలు చేయడంలో రైతులు మరియు రైస్‌మిల్లర్లు సమన్వయ సహకారంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ కొండయ్య, డిఎస్‌ఓ ధర్మారెడ్డి, జెడి హేమ మహేశ్వరరావు, రైస్‌మిల్లర్ల ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# 'నాట్య రంజిత' సుమేధ



నెల్లూరుకు చెందిన చిన్నారి రేణిగుంట సుమేధ(8) శ్రీ కృష్ణ దేవరాయ అవార్డు పురస్కారాలలో 'నాట్య రంజిత' బిరుదుతో పాటు గోల్డ్‌మెడల్ సాధించి సింహపురికే గర్వకారణమైంది. జనవరి 29, 30, 31తేదీలలో రాయలసీమ రంగస్థలి – తిరుపతి వారి రజతోత్సవ వేడుకలు తిరుమల మహతి ఆడిటోరియంలో జరిగాయి. ఈ సందర్భంగా రంగస్థల మాసపత్రిక వారు ఆంధ్రా–తెలంగాణ రాష్ట్రాలకు కూచిపూడి, భరతనాట్యం, జానపద పోటీలను నిర్వహించారు. సుమేధ జనవరి 29న కూచిపూడి నాట్యాన్ని ప్రదర్శించి నాట్యరంజిత బిరుదుతో పాటు గోల్డ్‌మెడల్‌ను సాధించింది.

# కులం మంటల్లో 'దేశం'

(మొదటి పేజీ తరువాయి)

నిన్న మొన్నటి వరకు కూడా కులం కంపు లేని రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. నీలం సంజీవరెడ్డి, పి.వి.నరసింహారావు, జలగం వెంగళరావు, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, నందమూరి తారక రామారావు, వై.యస్. రాజశేఖరరెడ్డి, టి.అంజయ్య, దామోదరం సంజీవయ్య... ఈ రాష్ట్రాన్ని వివిధ కులాల నాయకులు పరిపాలించారు. వీరి పాలనలో కులం ప్రస్తావన రావడం గాని, కులం ప్రభావం కనిపించడం గాని ఎప్పుడూ జరగలేదు. ప్రజలకు కూడా ఈ కులగజ్జి ఉండేది కాదు. అన్ని కులాల వాళ్లు కూడా ఎవరికి నచ్చిన పార్టీలో వాళ్లుండేవాళ్లు. కులం ప్రాతిపదికన రాష్ట్రంలో రాజకీయ పార్టీల నిర్మాణం జరగలేదు. ఎందుకంటే కులం పేరుతో పుట్టిన పార్టీకి గాని, కులం పేరుతో వచ్చిన నాయకుడికి గాని రాజకీయ మనుగడ ఉండదని చరిత్ర చెబుతోంది. ఈ రాష్ట్రంలో అన్నికులాల వారు ఆదరించబట్టే ఎన్టీఆర్ అయినా, వై.యస్. అయినా ముఖ్యమంత్రులు కాగలిగారు.

కాని ఎప్పుడూ లేని విధంగా గత రెండు మూడేళ్ల నుండే రాష్ట్రంలో కుల రాజకీయాలు రగులుకున్నాయి. 2008లో చిరంజీవి ప్రజారాజ్యం పెడితే దానిపై ఒక కులం ముద్ర వేశారు. కాబట్టే అది విజయవంతం కాలేకపోయింది. 2014 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ మీద కూడా ఒక సామాజిక వర్గం ముద్రవేసి కొన్ని వర్గాల ప్రజలను ఆ పార్టీకి దూరం చేయబట్టే జగన్ సీఎం కాలేకపోయాడు. 1995 నుండి 2004 వరకు చంద్రబాబు సీఎంగా వున్న కాలంలో కూడా పెద్దగా కులరాజకీయాలు లేవు. రాష్ట్రంలో అధిక సంఖ్యాకులైన కాపు కులం ప్రతినిధిగా వచ్చిన చిరంజీవిని కూడా ప్రజలు ఆదరించలేదన్నది నగ్నసత్యం.

మరి రాష్ట్రంలో కుల రాజకీయాలకు బీజం పడింది ఎక్కడన్నదే పెద్ద ప్రశ్న? 2014 ఎన్నికల్లో కాపుల ఓట్లు కీలకంగా మారాయి. విభజన తర్వాత 13జిల్లాలతో మిగిలిన ఏపిలో కాపులు మెజార్టీ వర్గంగా మారారు. దీంతో ఈ వర్గం వారి ఓట్లు కీలకమయ్యాయి. మొదట్నుండి కాపులు ఎక్కువగా కాంగ్రెస్ వైపుండేవాళ్లు. 2008లో చిరంజీవి ప్రజారాజ్యం పెట్టాక కొంత వరకు అటు మొగ్గారు. తర్వాత ప్రజారాజ్యంను కాంగ్రెస్‌లో విలీనం చేయడంతో కాపులకు చిరంజీవి మీద నమ్మకం పోయింది. 2014ఎన్నికల్లో కమ్మ సామాజికవర్గం తెలుగుదేశంకు, రెడ్డి సామాజిక వర్గం వైకాపాకు మధ్య విడిపోయింది. మధ్యలో బలమైన సామాజికవర్గంగా వున్న కాపులు క్రియాశీలకంగా మారారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ మునుపటిలానే ఉండుంటే కాపులు ఆ పార్టీలోనే వుండేవాళ్లు. కాంగ్రెస్ జీవం కోల్పోవడంతో ఏదో ఒక పార్టీ వైపు పోవాల్సిన పరిస్థితి వారి ముందు నిలిచింది.

ఇక్కడే చంద్రబాబు చురుకుగా ఆలోచించాడు. కాపులు రానిదే అధికారం కష్టమని అంచనావేశాడు. బీజేపీకి మాత్రమే ప్రచారం చేస్తానన్న పవన్ కల్యాణ్ ఇంటికి వెళ్లాడు. బ్రతిమలాడాడు. ఆయనను తెలుగుదేశంకు ప్రచారానికి ఒప్పించాడు. పవన్ ప్రచారం వల్లే ఎక్కువమంది కాపు వర్గీయులు తెలుగుదేశంకు ఓట్లేసారు. కాపులను మచ్చిక చేసుకునే ప్రయత్నంలో చంద్రబాబు కాపులను బిసిలలో చేరుస్తామని హామీ ఇచ్చాడు. ఒక ఉపముఖ్యమంత్రి పదవి కూడా ఇస్తానని వాగ్దానం చేశాడు. ఆయన వాగ్దానాల ప్రభావం ఎన్నికలపై పడింది. కాపులు మద్దతుగా నిలవబట్టే కృష్ణా, తూర్పు, పశ్చిమగోదావరి, విశాఖ జిల్లాల్లో టీడీపీ మెజార్టీ స్థానాలు సాధించగలిగింది. చంద్రబాబుకు అధికారం ఒక రకంగా కాపుల పుణ్యమే!

అధికారంలోకి వచ్చాక చెప్పినట్లే ఒకరికి డిప్యూటీ సీఎం ఇచ్చాడు. ఇద్దరు కాపు నేతలకు కీలక మంత్రిపదవులిచ్చాడు. తాజాగా కాపు కార్పోరేషన్ ఏర్పాటు చేశాడు. ఇవన్నీ చంద్రబాబు చేతిలో పనులు కాబట్టి చేయగలిగాడు. కాని రిజర్వేషన్లు చంద్రబాబు చేతిలో లేని పని. రాజ్యాంగ పరంగా ఎన్నో అడ్డంకులున్నాయి. ఆరోజు ఓట్ల మీద తాపత్రయంతో అడ్డు అదుపు లేకుండా రైతు ఋణమాఫీలాగే కాపు రిజర్వేషన్లు హామీ కూడా ఇచ్చాడు.

ఆ హామీని అమలు చేయమనే ఇప్పుడు కాపులు ఉద్యమబాట పట్టారు. తుని కేంద్రంగా కాపుల ఉద్యమానికి అంకురార్పణ జరిగింది. అయితే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌ను తగలబెట్టడం, పోలీసు వాహనాలను, పోలీసుస్టేషన్‌ను ధ్వంసం చేయడం వంటివి ఉద్యమంలో అపశృతులు. కాపుల ఉద్యమం చంద్రబాబుకు పెద్ద సంకటమే. విధ్వంసాలకు పాల్పడ్డవారిపై చర్యలు తీసుకోలేడు. అలాగని రిజర్వేషన్లు కల్పించలేడు. కాపు సామాజికవర్గాన్ని ఇక చంద్రబాబు తనతో నిలబెట్టుకోవడం కష్టమే! కాపు సామాజికవర్గంలోని బలమైన నాయకత్వ శక్తులన్నీ కూడా చంద్రబాబుపై నమ్మకం కోల్పోయి వైకాపా వైపు చూస్తున్నాయి. రాష్ట్రంలో అనూహ్యంగా తలెత్తిన కాపు ఉద్యమం తెలుగుదేశంకు సంకటంగానూ, వైకాపాకు చెలగాటంగానూ మారడం విశేషం!

# క్రీడాస్ఫూర్తి.. వీరిశెట్టి కృష్ణమూర్తి

## • ఆత్మీయ సన్మానంలో వక్తల ప్రశంస




ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్‌లలో అమోఘమైన ప్రతిభతో ఎన్నో విజయాలు సాధించి, ఎందరికో క్రీడాస్ఫూర్తి కలిగించి, తన ప్రతిభాపాటవాలతో క్రీడా రంగంలో సింహపురి సీమ కీర్తిబావుటాను దశదిశలా రెపరెపలాడించిన ప్రముఖ క్రీడాకారుడు వీరిశెట్టి వెంకట కృష్ణమూర్తికి గురువారం నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో పెద్దఎత్తున ఆత్మీయ సన్మానం జరిగింది. స్థానిక ప్రముఖులు, అనేక మంది క్రీడారంగ ప్రముఖులు ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొని వీరిశెట్టి కృష్ణమూర్తి జిల్లా క్రీడారంగానికి చేసిన సేవలను కొనియాడారు. క్రీడాస్ఫూర్తికి ఆయన నిలువుటద్దమని, ఆయన క్రీడాజీవితం క్రీడాకారులందరికీ మార్గదర్శకమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాప్ ఛైర్మెన్ పిఆర్ మోహన్ మాట్లాడుతూ, వీరిశెట్టి జిల్లాలో టేబుల్ టెన్నిస్, ఫుట్‌బాల్ క్రీడలకు పునాది వేసి ఎంతోమంది ప్రతిభ కలిగిన పేద క్రీడాకారులు ఉన్నతస్థాయికి వచ్చేందుకు కృషి చేశారని ప్రశంసించాడు. జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ, ప్రముఖ క్రీడాకారునిగా రాణించి అందరి ప్రశంసలు అందుకున్న వీరిశెట్టి కృష్ణమూర్తి ఎంత ఎదిగినా ఒదిగి వుండే మనస్తత్వం కలవారని, అలాంటి మంచి వ్యక్తికి ఘనసన్మానం చేయడం జిల్లా క్రీడాసంఘాల ఔన్నత్యాన్ని చాటుతుందని అన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ, ఒలింపిక్ అసోసియేషన్, టేబుల్‌టెన్నిస్ అసోసియేషన్‌ల వారు ఈ సన్మానాన్ని ఎంతో ఆత్మీయంగా అందరూ కలసి నిర్వహించడం వీరిశెట్టి కృష్ణమూర్తి అనుసరించిన మార్గదర్శకమైన క్రీడా జీవి తానికి నిదర్శనమన్నారు. శాప్ డైరెక్టర్ ఎం.రవీంద్రబాబు మాట్లాడుతూ, ఎంతోమంది ఆత్మీయులు, క్రీడాకారులు, క్రీడారంగం ప్రముఖుల మధ్య వీరిశెట్టి కృష్ణమూర్తిని సన్మానించడం ఎంతో ఆనందకరమని అన్నారు. అనంతరం వీరిశెట్టి కృష్ణమూర్తిని వివిధ క్రీడాసంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అనంతరం వీరిశెట్టి కుటుంబసభ్యులు కృష్ణమూర్తిని గజమాలతో, జ్ఞాపికలతో సన్మానించి తమ ఆత్మీయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో విజేతలైన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్‌కె యతిరాజ్, రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు తోట మనోహర్, జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు పత్తి రవీంద్రబాబు, కార్యదర్శి డా. వి.సురేష్, ఉపాధ్యక్షులు వీరిశెట్టి హాజరత్‌బాబు, పి. రాధిక, ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి పి.రామమూర్తి, వ్యాపారవేత్త సూర్యనారాయణ, పెద్దసంఖ్యలో క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## నెల్లూరోళ్ళ సారధ్యంలో హైదరాబాద్‌లో

# శ్రీవారి వైభవోత్సవాలు



కలియుగదైవం శ్రీ వేంకటేశ్వర స్వామి అనుగ్రహమో, ఆయన దివ్యాశీస్సులో ఏమోగాని శ్రీ వేంకటేశ్వర వైభవోత్సవాలను నిర్వహించే అదృష్టం నెల్లూరీయులకే దక్కుతుండడం విశేషం. గతేడాది నెల్లూరులో ప్రముఖ దాత, ఆధ్యాత్మిక చింతనాపరుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీవారి వైభవోత్సవాలు 'నభూతో నభవిష్యత్' అన్నట్లు జరిగాయి. ఆ తర్వాత నెల్లూరీయుడే అయిన కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు, ఆయన కుమార్తె దీపావెంకట్‌ల సారధ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో శ్రీ వేంకటేశ్వర వైభవోత్సవాలను కనులపండువగా నిర్వహించారు.

తాజాగా నెల్లూరుకే చెందిన ముగ్గురు ప్రముఖులు తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో 'శ్రీ వేంకటేశ్వర వైభవోత్సవం' నిర్వహణకు శ్రీకారం చుట్టారు. కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు తనయుడు, హర్ష టయోటా షోరూమ్‌ల అధినేత హర్షవర్ధన్, నెల్లూరుకే చెందిన వంశీరామ్ బిల్డర్స్ అధినేత సుబ్బారెడ్డి, ఇక శ్రీవారి వైభవోత్సవాల నిర్వహణలో అందరి మెప్పు పొందిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు హైదరాబాద్‌లో వైభవోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ నెల 6వ తేదీ నుండి 12వ తేదీ వరకు హైదరాబాద్, ఇందిరాపార్క్‌రోడ్‌లోని ఎన్‌టిఆర్ స్టేడియంలో ఏడు రోజులు టిటిడి ఆధ్వర్యంలో ఈ వైభవోత్సవాలు జరుగుతాయి. 6వ తేదీ సాయంత్రం 5గంటలకు వైభవోత్సవాల అంకురార్పణ జరుగుతుంది. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ అంకురార్పణ కార్యక్రమానికి హాజరుకానున్నారు. విశేషపూజలలో భాగంగా 7వ తేదీ వసంతోత్సవం, 8వ తేదీ విశేషపూజ, 9వ తేదీ అష్టదళ పాద పద్మారాధనం, 10వ తేదీ సహస్రకలశాభిషేకం, 11వ తేదీ తిరుప్పావడ శ్రీనివాస కల్యాణం, 12వ తేదీ అభిషేకం, పుష్పయాగం కార్యక్రమాలు జరుగుతాయి. ఈ పూజలు ఉదయం, రాత్రి వేళల్లో జరుగుతాయి. నిత్యపూజల్లో భాగంగా 7వ తేదీ నుండి 12వ తేదీ వరకు ప్రతిరోజూ 6గంటల నుండి రాత్రి 9గంటల దాకా వరుసగా సుప్రభాతం, తోమాలసేవ, కొలువు, అర్చన, నివేదన, శాత్తుమెర, విశేషపూజ, రెండవ నివేదన, సర్వదర్శనం, సహస్ర దీపాలంకరణ సేవ, రాత్రి కైంకర్యం, ఏకాంత సేవలు జరుగుతాయి. 12వ తేదీ రాత్రి 10.30గంటలకు పుష్పయాగంతో ఈ వైభవోత్సవాలు ముగుస్తాయి. హైదరాబాద్‌లోని శ్రీవారి భక్తులకు నెల్లూరీయులు అందిస్తున్న అపురూప అవకాశమిది. రాష్ట్రం ప్రాంతాల వారీగా విడిపోయిందిగాని శ్రీవారి భక్తులు విడిపోలేదని, ఆ గోవిందుడు అందరివాడేనని నిరూపిస్తూ తెలంగాణలో శ్రీవారి వైభవోత్సవాలను నిర్వహిస్తున్న నెల్లూరీయులకు అభినందనలు.

# అనవసర రాద్ధాంతం

- మాటలతో పోయేది... తూటాల దాకా తెచ్చారు
- అధికారులు సమయస్ఫూర్తితో వ్యవహరించకపోయుంటే నెల్లూరులో గందరగోళమే

నెల్లూరులో సంచలనం సృష్టించిన జిల్లా ఎస్పీ–ముస్లింల మధ్య వివాదానికి మధ్యవర్తుల జోక్యంతో తెరపడింది. అయితే ఈ మొత్తం సంఘటనకు చిన్న చిన్న మాటలే కారణంగా కనిపిస్తున్నాయి. ఎదుటి వారి మనోభావాలకు తగ్గట్లుగా అంశాన్ని సున్నితంగా వివరించడంలో అధికారులు తడబడడం, వీళ్ళు చెప్పింది మైనార్టీ సోదరులు మరో కోణంలో అర్ధం చేసుకోవడంతో వివాదం రేగింది. అయితే, అధికారులు చొరవచూపి సమయస్ఫూర్తితో వ్యవహరించబట్టి సరిపోయిందిగాని లేకుంటే ఈ గొడవ చిలికి చిలికి గాలివానే అయ్యుండేది. కొందరు ముస్లిం పెద్దలు తమ వాళ్లకు నచ్చజెప్పి వాతావరణాన్ని చల్లబరిచారు.

భారతదేశంలో ఒకరి పట్ల ఒకరికి అలాంటి అనుమానాలు లేవు. పాతబస్తీ లాంటి చోట్ల తప్పితే చాలావరకు అన్ని ప్రాంతాల్లో అన్ని వర్గాల ప్రజలు కలసి మెలసి జీవిస్తున్నారు. అయితే భారతదేశంలో ముస్లిం నిరుద్యోగయువతపై ఐసిస్ వల వేస్తుందని, తమ ఉచ్చులోకి లాగుతుందని ఇంటలిజెన్స్ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఈమధ్య ఐసిస్ ఆకర్షణలో పడ్డ పలువురు యువకులను అదుపులోకి కూడా తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ముస్లిం యువకులు ఐసిస్ ఆకర్షణలో పడకుండా చూడాలని, ఇంటలిజెన్స్ అధికారులు అన్ని జిల్లాల పోలీసు యంత్రాంగాలకు సమాచారమందించారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల జిల్లా ఎస్పీ గజరావు భూపాల్ నెల్లూరులోని స్వర్ణవేదిక కల్యాణ మండపంలో ముస్లిం పెద్దలు, యువకులతో సమావేశం నిర్వహించారు. వచ్చిన వారిలో యువకులను ఎంచుకుని వారితో ప్రత్యేక సమావేశం పెట్టారు. ఇక్కడ ఆయనేం మాట్లాడాడోగాని, ఆయన మాటలు మాత్రం వివాదాస్పదమయ్యాయి. ముస్లిం మనోభావాలను గాయపరిచేలా ఎస్పీ మాట్లాడాడంటూ ముస్లింలు ఆందోళనకు దిగారు. జనవరి 30వ తేదీన భారీ సంఖ్యలో ముస్లింలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఎస్పీ కారును ధ్వంసం చేశారు. ఈ సున్నిత అంశంపై జిల్లా కలెక్టర్ యం.జానకి, గుంటూరు రేంజ్ ఐజి సంజయ్‌తో పాటు జిల్లా తెలుగుదేశం నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బీద రవిచంద్ర తదితరులు విడివిడిగా ముస్లిం పెద్దలతో సమావేశాలు నిర్వహించి కొన్ని షరతుల మీద వివాదానికి తెరదించారు. అయితే శాంతి భద్రతల దృష్ట్యా జిల్లా పోలీసు ఉన్నతాధికారిగా ఎస్పీ నిర్వహించిన ఓ సమావేశం వివాదాస్పదం కావడం, దీని మూలంగానే పోలీసు అధికారులను బదిలీ చేసే పరిస్థితి రావడం పట్ల పోలీసు వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.







Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com